TG TEL/25/A1234 www.kakatiyanews.com

# ఉత్తరం కాకతీయ

మంగళవారం, 18 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 05 | పేజీలు: 10 వెల: 5

## నిషేధిత ఆస్తుల జాబితాలో మీ భూమి ఉందా?



- ముందుగానే తెలుసుకోవడం ఎలా?
- భూ భారతి పోర్టల్‌లోనే పరిశీలన
- నిషేధానికి కారణం తెలుసుకోవాలి
- తప్పుగా నమోదైతే ఫిర్యాదు చేసే అవకాశం
- పత్రాలతో అధికారులను సంప్రదించాలి
- మీసేవ ఈ-కేవైసీ తర్వాత పరిశీలన

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో భూమి కొనుగోలు చేసినా, వారసత్వంగా వచ్చినా, ఏళ్లుగా ఆధీనంలో ఉన్నా.. రిజిస్ట్రేషన్ లేదా భూమి లావాదేవీ సమయంలో ఒక్కసారిగా అది నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందని తెలిస్తే యజమానులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అయితే భూమి నిషేధిత జాబితాలో ఉందో లేదో ముందుగానే తెలుసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన భూ భారతి సమీకృత భూ రికార్డుల నిర్వహణ వ్యవస్థలో నిషేధిత ఆస్తుల వివరాలను పరిశీలించవచ్చు. వ్యవసాయ భూములకు ప్రత్యేకంగా నిషేధిత భూముల శోధన సదుపాయం కూడా ఉంది. భూమి నిషేధిత జాబితాలో ఉందని గుర్తించినంత మాత్రాన హక్కు పూర్తిగా రద్దయినట్లు భావించకూడదు. ముందుగా ఆ భూమి ఎందుకు నిషేధిత జాబితాలోకి వెళ్లిందో, ఏ రికార్డు ఆధారంగా నమోదైందో తెలుసుకోవడం కీలకం.

**భూ భారతి పోర్టల్‌లో పరిశీలన**

భూమి యజమానులు తమ భూమి నిషేధిత జాబితాలో ఉందో లేదో భూ భారతి అధికారిక పోర్టల్‌లో పరిశీలించుకోవచ్చు. ఇందుకోసం

........(తరువాయి 2లో)



- తెలంగాణకు ఒక్కరికీ దక్కని చోటు
- ఓబీసీ మోర్చా పగ్గాలు అమర్‌పాల్ మౌర్యకు
- స్మృతి ఇరానీ, హరీష్ ద్వివేదికి కీలక బాధ్యతలు
- నాన్‌యాదవ్ ఓబీసీలను మళ్లీ తమవైపు తిప్పుకునే వ్యూహం
- రెండువేల ఇరవై ఏడులో యూపీ ఎన్నికలే టార్గెట్?

# యూపీపైనే కమలనాథుల గురి!

## జాతీయ కార్యవర్గంలో ఆ రాష్ట్రానికి పెద్దపీట

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**

భారతీయ జనతా పార్టీ కొత్త జాతీయ కార్యవర్గ కూర్పులో ఉత్తర్‌ప్రదేశ్‌కు దక్కిన ప్రాధాన్యం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. పరిమిత సంఖ్యలో కీలక పదవులను భర్తీ చేసిన జాతీయ బృందంలో యూపీకి ఏకంగా ఎనిమిది మందికి ప్రాధాన్యం కల్పించగా.. తెలంగాణ నుంచి ఒక్కరికి కూడా చోటు దక్కకపోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రూపొందించిన కొత్త బృందంలో యూపీకి చెందిన హరీష్ ద్వివేది, స్మృతి ఇరానీ జాతీయ ప్రధాన కార్యదర్శులుగా, భోలా సింగ్, సంగీతా యాదవ్ జాతీయ కార్యదర్శులుగా, రేఖా వర్మ, డాక్టర్ తారిఖ్ మన్సూర్ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా అమర్‌పాల్ మౌర్య, మైనారిటీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా కున్వర్ వాషిత్ అలీకి బాధ్యతలు అప్పగించారు. పరిమిత సంఖ్యలో ఏర్పాటు చేసిన జాతీయ కార్యవర్గంలో యూపీకి ఇంతటి ప్రాధాన్యం కల్పించడం వెనుక రెండువేల ఇరవై ఏడులో జరగనున్న ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలే ప్రధాన కారణమన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**యూపీ ఎన్నికలే అసలు లెక్క**

ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ బీజేపీ ఇప్పటి నుంచే రాజకీయ కసరత్తు ప్రారంభించినట్లు కొత్త జాతీయ కార్యవర్గ కూర్పు స్పష్టం చేస్తోంది. దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన

........(తరువాయి 2లో)

### తెలంగాణకు ప్రాతినిధ్యం కరవు!

- బీజేపీ జాతీయ బృందంలో రాష్ట్రానికి నో బెర్త్
- యూపీకి ఏకంగా ఎనిమిది కీలక పదవులు
- లక్ష్మణ్‌కు దక్కని కొనసాగింపు
- ఓబీసీ మోర్చా పగ్గాలు మౌర్యకు అప్పగింత
- తెలంగాణపై పార్టీ జాతీయ నాయకత్వం లెక్కేంటి?
- రాష్ట్ర బీజేపీలో మొదలైన రాజకీయ చర్చ

2

## టికెట్ చిచ్చు.. బహిరంగ పోరు!

- వనపర్తి కాంగ్రెస్‌లో రెండు వర్గాల పోరు
- మేఘారెడ్డిపై చిన్నారెడ్డి సంచలన ఆరోపణలు
- డబ్బులిచ్చి టికెట్ తెచ్చుకున్నట్లు నిరూపించాలి
- చిన్నారెడ్డికి మేఘారెడ్డి ఘాటు కౌంటర్
- అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానంటూ ప్రకటన



3

## జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి



- రూ.15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- 3,245 ఎకరాల్లో పారిశ్రామిక నగర అభివృద్ధి
- 2028 మార్చి నాటికి పనులన్నీ పూర్తి
- నీటి సరఫరా టెండర్ల ప్రక్రియ పూర్తి
- తెలంగాణకు 4 ప్లగ్ అండ్ ప్లే పార్కులు ఇవ్వాలి
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

3

## పీఏసీ భేటీకి రాజగోపాల్‌రెడ్డి దూరం

- భువనగిరిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం
- పార్టీ బలోపేతంపై నేతల సుదీర్ఘ చర్చ
- ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష
- కీలక భేటీకి ఎమ్మెల్యే గైర్హాజరు
- ముందస్తు సమాచారం లేకపోవడంపై అసంతృప్తి



3

# ఓటర్ల జాబితాలో మీ పేరు ఉందా?

## ముసాయిదా జాబితా విడుదల



- 73.3 లక్షల ఓట్లపై ప్రత్యేక పరిశీలన.. 92 లక్షల మందికి నోటీసులు
- బూత్ నంబర్లు మారిన చోట్ల జాగ్రత్త
- ఆగస్టు 17 నుంచి అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 19న తుది జాబితా
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**

ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిశీలించుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఇంటింటి సర్వే అనంతరం రూపొందించిన ముసాయిదా జాబితాను సోమవారం విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 73.3 లక్షల మంది ఓటర్ల వివరాలు అందుబాటులో లేకపోవడంతో వారిని గైర్హాజరు, చిరునామా మారిన, మరణించిన, నకిలీ ఓటర్ల విభాగాల్లో గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 2.65 కోట్ల మంది తమ వివరాలను అందించారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 19.4 లక్షల మంది ఓటర్ల వివరాలు పరిశీలనకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ముసాయిదా జాబితాను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోని ప్రత్యేక సవరణ విభాగంతో పాటు ఓటర్ల సేవల పోర్టల్‌లో పరిశీలించుకోవచ్చని సూచించారు.

**73.3 లక్షల మంది వివరాలు లభ్యం కాదు**

ఇంటింటి సర్వేలో వివరాలు అందని 73.3 లక్షల మందిని

........(తరువాయి 2లో)

## పేదల వైద్యం కోసమే టిమ్స్

- కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తెచ్చాం
- ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.5,226 కోట్లు
- రెండేళ్లలో వైద్య రంగానికి రూ.21,800 కోట్లు
- 2027 డిసెంబరు 9లోగా నాలుగు ఆస్పత్రులు
- ఒక్కో ఆస్పత్రికి ప్రత్యేక డైరెక్టర్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయం,

........(తరువాయి 2లో)

## కేటీఆర్ నేరాలు నిరూపితం.. శిక్ష తప్పదు



- ఫార్ములా-ఈ కార్ రేసులో తప్పు చేశారు
- మూసీ సుందరీకరణను కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు
- తెలంగాణకు తెచ్చిన ప్రాజెక్టులపై చర్చకు సిద్ధం
- బీసీ బిల్లుపై కేంద్రం సమాధానం చెప్పాలి: మహేశ్‌కుమార్‌గౌడ్

3

## వాహ్.. కమిషనర్ జీ!

- చిన్నారి వైద్యానికి అండగా అభిషేక్ అగస్త్య
- రూ.14 లక్షల సాయం అందేలా చొరవ
- శస్త్రచికిత్స విజయవంతం.. కోలుకున్న చిన్నారి
- కమిషనర్ పేరుతో ‘జస్విక శ్రీ’గా నామకరణం
- కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు



6

## టీజీఎండీసీ పీవోల బదిలీలు

- ఇసుక నిర్వహణపై పర్యవేక్షణకు జిల్లాల పునర్విభజన
- పలువురికి అదనపు బాధ్యతలు.. మరికొందరికి కొత్త జిల్లాలు
- శంకర్‌నాయక్, బి.రాజు మాతృసంస్థలకు
- వికారాబాద్ బాధ్యతల నుంచి రాకేష్‌కుమార్ రిలీవ్
- తక్షణమే కొత్త బాధ్యతలు చేపట్టాలని ఆదేశాలు

3

TGMDC

## అక్రమాల పీవోకు చెక్

- ఎట్టకేలకు భద్రాద్రి పీవో శంకర్ నాయక్‌కు ఉద్వాసన
- టీజీఎండీసీ నుంచి మాతృసంస్థకు బదిలీ
- ఏళ్లుగా కీలక బాధ్యతల్లో కొనసాగిన అధికారిపై ఆరోపణలు
- ఇసుక కాంట్రాక్టర్ శ్రీకర్‌కు సహకరించారనే విమర్శలు
- బీటీపీఎస్ ఇసుక లెక్కలు బయటపెట్టేదెప్పుడు?
- ఆర్టీఐ దరఖాస్తులపైనా అధికారుల మౌనం
- పాత వ్యవహారాలపై ఇప్పుడు టీజీఎండీసీలో చర్చ

3

# యూపీపైనే కమలనాథుల గురి!

(మొదటిపేజీ తరువాయి)

యూపీలో సామాజిక సమీకరణాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో పార్టీ నాయకత్వం ముందుగానే వ్యూహాలను సిద్ధం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఓబీసీ వర్గాల్లో పార్టీకి ఉన్న పట్టు మరింత బలోపేతం చేయడంతోపాటు రెండువేల ఇరవై నాలుగు లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని కొత్త వ్యూహానికి పదును పెడుతున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. యూపీ నుంచి ఎనిమిది మందికి కీలక పదవులు ఇవ్వడం ద్వారా రాష్ట్రంలోని వివిధ సామాజిక వర్గాలు, ప్రాంతాలు, రాజకీయ వర్గాలకు జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం కల్పించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. మౌర్య, కుష్వాహ, శాక్య, సైని వంటి ప్రభావవంతమైన వెనుకబడిన వర్గాలను ఆకట్టుకోవడంలో భాగంగానే అమర్‌పాల్ మౌర్యను ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు అంచనాలు వ్యక్తమవుతున్నాయి.



**అమర్‌పాల్ మౌర్యకు కీలక బాధ్యత**

తెలంగాణకు చెందిన డాక్టర్ కే. లక్ష్మణ్ స్థానంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అమర్‌పాల్ మౌర్యకు జాతీయ ఓబీసీ మోర్చా పగ్గాలు అప్పగించడం కొత్త కూర్పులో అత్యంత కీలక పరిణామంగా భావిస్తున్నారు. యూపీ రాజకీయాల్లో కేశవ్‌ప్రసాద్ మౌర్య తర్వాత మౌర్య సామాజిక వర్గానికి చెందిన జాతీయ స్థాయి నేతగా అమర్‌పాల్ మౌర్య ఎదిగిన నేపథ్యంలో ఆయన నియామకానికి ప్రాధాన్యం ఏర్పడింది. గతంలో యూపీ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అమర్‌పాల్ మౌర్య ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. యూపీలో నాన్‌యాదవ్ ఓబీసీ వర్గాలను తిరిగి బీజేపీ వైపు సమీకరించడంలో ఆయన కీలకంగా పనిచేస్తారని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెండువేల ఇరవై నాలుగు లోక్‌సభ ఎన్నికల్లో ఓబీసీ వర్గాల్లో చోటుచేసుకున్న రాజకీయ మార్పులు బీజేపీకి ఆందోళన కలిగించాయి. యాదవులు సమాజ్‌వాదీ పార్టీకి అండగా నిలవగా.. యాదవేతర ఓబీసీలలోని కొంత వర్గం బీజేపీకి మద్దతు ఇచ్చింది. ఈ సమీకరణాన్ని మరింత బలోపేతం చేయడమే ఇప్పుడు పార్టీ ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

**పీడీఏ వ్యూహానికి కౌంటర్?**

సమాజ్‌వాదీ పార్టీ రెండువేల ఇరవై నాలుగు లోక్‌సభ ఎన్నికల్లో పీడీఏ పేరుతో వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీలను ఒకే రాజకీయ వేదికపైకి తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. ఈ వ్యూహం బీజేపీకి కొంత మేరకు నష్టం కలిగించింది. ముఖ్యంగా ఓబీసీ వర్గాల్లో వచ్చిన మార్పులు కమలనాథులను పునరాలోచనలో పడేశాయి. దీంతో చేజారిన వర్గాలను మళ్లీ తమవైపు తిప్పుకునేందుకు బీజేపీ నాయకత్వం సామాజిక సమీకరణాలపై దృష్టి సారించింది. అందులో భాగంగానే అమర్‌పాల్ మౌర్యకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మౌర్యతోపాటు కుష్వాహ, శాక్య, సైని తదితర నాన్‌యాదవ్ ఓబీసీ వర్గాలను సమీకరించేందుకు ఆయనకు జాతీయ స్థాయి బాధ్యతలు ఉపయోగపడతాయని పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. యూపీ ఎన్నికల్లో ఓబీసీ ఓటుబ్యాంకు కీలకం కానుండటంతో ఈ నియామకం వెనుక రాజకీయ లెక్కలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**స్మృతి ఇరానీకి జాతీయ స్థాయిలో మరింత ప్రాధాన్యం**

కేంద్ర మంత్రిగా పనిచేసిన స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడం కూడా కొత్త బృందంలో మరో కీలక అంశంగా మారింది. రెండువేల పంతొమ్మిది లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఓడించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆమె పార్టీలో మంచి వక్తగా పేరుగాంచారు. జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ఆమె రాజకీయ అనుభవాన్ని యూపీతోపాటు దేశవ్యాప్తంగా ఉపయోగించుకోవాలని బీజేపీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. యూపీకి చెందిన హరీష్ ద్వివేదికి కూడా జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు దక్కాయి. యువ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు సంగీతా యాదవ్‌కు జాతీయ కార్యదర్శి పదవి అప్పగించారు. భోలా సింగ్, రేఖా వర్మ, డాక్టర్ తారిఖ్ మన్సూర్, కున్వర్ వాషిత్ అలీకి కూడా కీలక బాధ్యతలు ఇవ్వడంతో యూపీలోని వివిధ సామాజిక, రాజకీయ వర్గాలను సమన్వయం చేసే ప్రయత్నం జరిగినట్లు కనిపిస్తోంది.

**తెలంగాణకు ప్రాతినిధ్యం కరవు**

కొత్త జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నుంచి ఒక్క నాయకుడికి కూడా చోటు దక్కకపోవడం రాష్ట్ర బీజేపీలో చర్చనీయాంశంగా మారింది. గతంలో తెలంగాణకు చెందిన డాక్టర్ కే. లక్ష్మణ్ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా కొనసాగగా.. ఇప్పుడు ఆ బాధ్యతను యూపీకి చెందిన అమర్‌పాల్ మౌర్యకు అప్పగించారు. దీంతో జాతీయ స్థాయిలో తెలంగాణకు దక్కుతున్న ప్రాధాన్యంపై కూడా రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. అయితే ప్రస్తుత కూర్పును పూర్తిగా యూపీ రాజకీయ అవసరాల కోణంలోనే చూడాల్సి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రంగా ఉన్న ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో బీజేపీ ముందుగానే అక్కడి రాజకీయ సమీకరణాలను బలోపేతం చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త జాతీయ కార్యవర్గంలో యువతకు కూడా ప్రాధాన్యం కల్పించారు. నలభై ఏళ్ల లోపు వయసున్న వారు ఆరుగురు ఉండగా.. నలభై నుంచి నలభై తొమ్మిదేళ్ల మధ్య వయసున్న వారు పదిహేను మంది ఉన్నారు. యాభై నుంచి యాభై తొమ్మిదేళ్ల మధ్య వయసున్న వారు ఇరవై ఒక్క మంది ఉన్నారు. అనుభవంతోపాటు యువతకు ప్రాతినిధ్యం కల్పించేలా బృందాన్ని రూపొందించినట్లు ఈ కూర్పు స్పష్టం చేస్తోంది. మొత్తంగా కొత్త జాతీయ కార్యవర్గంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు దక్కిన ప్రాధాన్యం వెనుక రెండువేల ఇరవై ఏడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నాన్‌యాదవ్ ఓబీసీ వర్గాలను తిరిగి బీజేపీ వైపు సమీకరించడంతోపాటు పీడీఏ వ్యూహానికి దీటుగా సామాజిక సమీకరణాలను బలోపేతం చేయడంపై పార్టీ దృష్టి పెట్టినట్లు కొత్త నియామకాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణకు ఒక్కరికీ చోటు దక్కకపోవడం మాత్రం రాష్ట్ర బీజేపీలో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది.

# పేదల వైద్యం కోసమే టిమ్స్

(మొదటిపేజీ తరువాయి)

మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ కోసం రూ.2,700 కోట్లు ఖర్చు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సీఎంఆర్ఎఫ్ కోసం రూ.2,526 కోట్లు వెచ్చించామని, మొత్తంగా రూ.5,226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశామని చెప్పారు. రెండేళ్లలో వైద్య, ఆరోగ్య శాఖ కోసం రూ.21,800 కోట్లు ఖర్చు చేశామన్నారు. మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్‌లోనూ అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

**పది వేల పడకలు అందుబాటులోకి**

ఉస్మానియా ఆస్పత్రి శిథిలావస్థకు చేరినా పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఆస్పత్రి నిర్మించేందుకు ప్రయత్నించలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. టిమ్స్ ఆస్పత్రులు, వరంగల్ ఆస్పత్రికి గత ప్రభుత్వం కేవలం టెంకాయకొట్టి వదిలేసిందన్నారు. మేం అధికారంలోకి వచ్చాక సనత్‌నగర్, ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆస్పత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇవన్నీ పూర్తయితే రాష్ట్రంలో 10 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. 2027 డిసెంబరు 9లోగా ఉస్మానియా, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ ఆస్పత్రులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఒక్కో ఆస్పత్రికి ఒక్కో డైరెక్టర్‌ను నియమించి పర్యవేక్షిస్తామని సీఎం తెలిపారు. కార్పొరేట్ తరహాలో ఆస్పత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. రోగుల వెంట వచ్చే అటెండెంట్లు ఉండేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అదనపు సమయం కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పేదలకు వైద్యం అందించేందుకు ప్రజా ప్రభుత్వం ఉందని, మా రేవంతన్న ఉన్నాడన్న నమ్మకం ప్రజల్లో కలిగించాలని అన్నారు.


**పదేళ్లు ఆస్పత్రులు ఎందుకు పూర్తి చేయలేదు?**

మేం టిమ్స్‌ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లలా వచ్చి తిరిగి వెళ్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేటీఆర్ వచ్చి ఈ ఆస్పత్రిని తామే కట్టామని చెప్పి వెళ్లారని ఎద్దేవా చేశారు. మీరు కట్టిన ఆస్పత్రిని పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ కుటుంబమే అధికారంలో ఉన్నప్పుడు రిబ్బన్ ఎందుకు కట్ చేయలేదని ప్రశ్నించారు. ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్‌పల్లి ఫామ్‌హౌస్‌లు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదని, పేదలకు వైద్యం అందించే ఆస్పత్రులు పూర్తి చేయాలన్న ఆలోచన ఎందుకు రాలేదని నిలదీశారు. ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గానికి రూ.10 కోట్లు, రూ.20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే పాపాలు కొంతైనా తగ్గుతాయని, అబద్ధపు ప్రచారాలతో ప్రజలను నమ్మించలేరని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నానని సీఎం వ్యాఖ్యానించారు. వాళ్లు అబద్ధాలు చెప్పడం మాననంత కాలం తాను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటానని స్పష్టం చేశారు. పేదలకు వైద్యం అందించేందుకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, టిమ్స్ ఆస్పత్రుల పూర్తితో రాష్ట్రంలో వైద్య సేవలు మరింత విస్తరిస్తాయని రేవంత్‌రెడ్డి అన్నారు.

# నిషేధిత ఆస్తుల జాబితాలో మీ భూమి ఉందా?

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా, మండలం, రెవెన్యూ గ్రామం, సర్వే నంబర్, అవసరమైన చోట సబ్ డివిజన్ వివరాలను సరిగ్గా నమోదు చేయాలి. భూమిని గుర్తించడంలో సర్వే నంబర్ అత్యంత కీలకం. భూ భారతి వ్యవస్థలో భూ హక్కుల రికార్డులు, యాజమాన్య చరిత్ర, సర్వే వివరాలు, నిషేధిత ఆస్తి స్థితి వంటి సమాచారాన్ని పరిశీలించే అవకాశం ఉంది. భూమి నిషేధిత జాబితాలో కనిపిస్తే వెంటనే భయపడకుండా, దాని వెనుక ఉన్న కారణాన్ని తెలుసుకోవాలి. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, సీలింగ్ చట్టాలకు సంబంధించిన భూములు, దేవాదాయ లేదా వక్ఫ్ సంబంధిత ఆస్తులు, కోర్టు కేసులు లేదా ఇతర ప్రభుత్వ ప్రయోజనాలకు సంబంధించిన ఆస్తుల కారణంగా భూములపై లావాదేవీలకు పరిమితులు ఉండవచ్చు. అయితే అన్ని భూములకు ఒకే కారణం ఉండదు. ఒక్కో కేటగిరీకి వర్తించే చట్టం, అధికార పరిధి వేర్వేరుగా ఉంటాయి. అందువల్ల నిషేధిత జాబితాలో ఉందనే కారణంతో అన్ని భూములకు ఒకే పరిష్కారం ఉంటుందని భావించకూడదు.



**తప్పుగా నమోదైతే ఫిర్యాదు**

తమ భూమిని నిషేధిత ఆస్తుల జాబితాలో తప్పుగా చేర్చారని భావించే యజమానులకు భూ భారతి ద్వారా ప్రత్యేక పరిష్కార మార్గం ఉంది. నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చడంపై ఫిర్యాదు అనే సేవను ఉపయోగించుకోవచ్చు. భూ యజమాని సంబంధిత వివరాలు, నిషేధం తప్పుగా నమోదైందని భావించడానికి గల కారణాలు, అవసరమైన పత్రాలను సమర్పించాలి. అనంతరం మీసేవలో ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలి. ఆ తర్వాత దరఖాస్తు సంబంధిత అధికారుల పరిశీలనకు వెళ్తుంది. నిషేధిత జాబితాలో భూమి ఉందని తెలిసిన వెంటనే ముందుగా పత్రాలను సేకరించుకోవాలి. పట్టాదారు పాస్‌బుక్, హక్కుల రికార్డు, పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, అమ్మకపు పత్రం, వారసత్వ పత్రాలు, పాత రెవెన్యూ రికార్డులు, అవసరమైన చోట కోర్టు లేదా ప్రభుత్వ ఉత్తర్వులను పరిశీలించాలి. నిషేధిత జాబితాలో నమోదైన వివరాలతో ఈ పత్రాలను సరిపోల్చుకోవాలి. ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూముల విషయంలో సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించి భూమి నిజంగా ప్రభుత్వ పరిధిలో ఉందా, రికార్డుల్లో పొరపాటు జరిగిందా అన్నది నిర్ధారించుకోవాలి.

**అవసరమైతే కలెక్టర్‌కు ఫిర్యాదు**

సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించాలి. అవసరమైన సందర్భంలో జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లవచ్చు. దేవాదాయ లేదా వక్ఫ్ సంబంధిత ఆస్తుల విషయంలో మాత్రం సాధారణ రెవెన్యూ ఫిర్యాదుతోనే పరిష్కారం అవుతుందని భావించకూడదు. ఆ భూమి ఏ రికార్డు ఆధారంగా సంబంధిత పరిధిలోకి వెళ్లింది, గెజిట్ ప్రకటన ఉందా, సంబంధిత సంస్థ రికార్డుల్లో భూమి ఎలా నమోదైందన్న అంశాలను పరిశీలించాలి. అవసరమైతే సంబంధిత చట్టం కింద అధికార సంస్థలను లేదా న్యాయపరమైన మార్గాన్ని ఆశ్రయించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో సర్వే నంబర్‌లోని కొంత భూమిని మాత్రమే ప్రభుత్వ అవసరాల కోసం సేకరించినప్పటికీ, మొత్తం సర్వే నంబర్ నిషేధిత లేదా సేకరించిన భూమి కేటగిరీలోకి వెళ్లే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాల్లో పట్టాదారు పాస్‌బుక్, వాస్తవంగా సేకరించిన విస్తీర్ణం, సర్వే నంబర్, భూసేకరణ ఉత్తర్వులను సమర్పించవచ్చు. అధికారుల పరిశీలన అనంతరం సరైన విస్తీర్ణాన్ని నమోదు చేసి ఉత్తర్వులు జారీ చేసే ప్రక్రియ ఉంటుంది. అవసరమైతే రికార్డు సవరణ, సర్వే నంబర్ విభజన వంటి చర్యలు చేపట్టే అవకాశం ఉంది. అందుకే భూమి విక్రయించే సమయంలోనే నిషేధిత జాబితా విషయం తెలుసుకోవడం కాకుండా ముందుగానే భూ భారతి పోర్టల్‌లో పరిశీలించుకోవడం మంచిది. నిషేధిత జాబితాలో ఉంటే ఎందుకు ఉందో తెలుసుకోవడం, సంబంధిత పత్రాలను సరిపోల్చుకోవడం, తప్పుగా నమోదైందని భావిస్తే ఫిర్యాదు చేయడం కీలకం. భూమి స్వభావం, రికార్డులు, నిషేధానికి కారణం, వర్తించే చట్టాలను బట్టి పరిష్కార మార్గం మారుతుందని గుర్తుంచుకోవాలి.

# తెలంగాణకు ప్రాతినిధ్యం కరవు!

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** బీజేపీ కొత్త జాతీయ కార్యవర్గ కూర్పులో తెలంగాణకు ప్రాతినిధ్యం లేకపోవడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రకటించిన కొత్త బృందంలో తెలంగాణ నుంచి ఒక్క నాయకుడికీ కీలక బాధ్యత దక్కలేదు. మరోవైపు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఏకంగా ఎనిమిది మందికి జాతీయ స్థాయిలో కీలక పదవులు లభించాయి. ముఖ్యంగా తెలంగాణకు చెందిన డాక్టర్ కే. లక్ష్మణ్ నిర్వహించిన జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్ష బాధ్యతలను ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అమర్‌పాల్ మౌర్యకు అప్పగించడం రాష్ట్ర బీజేపీలో చర్చకు కారణమైంది. గత కొంతకాలంగా జాతీయ స్థాయిలో తెలంగాణ బీజేపీకి పెరుగుతున్న ప్రాధాన్యం నేపథ్యంలో తాజా కూర్పులో ఒక్కరికీ చోటు దక్కకపోవడం వెనుక కారణాలేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డాక్టర్ కే. లక్ష్మణ్ గతంలో జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా పని చేశారు. తెలంగాణలో బీజేపీని బలోపేతం చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఆయనకు జాతీయ స్థాయిలో ఆ బాధ్యత దక్కడం అప్పట్లో రాష్ట్ర పార్టీకి ప్రాధాన్యంగా మారింది. అయితే తాజా జాతీయ కార్యవర్గంలో ఆయనకు అదే స్థాయిలో కొనసాగింపు లేకపోవడం చర్చనీయాంశమైంది. ఆయన స్థానంలో యూపీకి చెందిన అమర్‌పాల్ మౌర్యను ఎంపిక చేయడం ద్వారా పార్టీ జాతీయ నాయకత్వం యూపీ రాజకీయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన సంకేతాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో పార్టీకి రాజకీయంగా బలం పెరుగుతున్న సమయంలో జాతీయ కార్యవర్గంలో రాష్ట్రానికి ఒక్క పదవి కూడా దక్కకపోవడంపై పార్టీ శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రానికి చెందిన నాయకుల్లో ఎవరికీ జాతీయ బాధ్యతలు ఇవ్వకపోవడం సాధారణ కూర్పులో భాగమా? లేక పార్టీ జాతీయ నాయకత్వం ముందున్న రాజకీయ ప్రాధాన్యాల మేరకు తీసుకున్న నిర్ణయమా? అన్న చర్చ సాగుతోంది.

**యూపీకి పెద్దపీట**

కొత్త జాతీయ కార్యవర్గంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఎనిమిది మందికి కీలక పదవులు దక్కాయి. హరీష్ ద్వివేది, స్మృతి ఇరానీ జాతీయ ప్రధాన కార్యదర్శులుగా, భోలా సింగ్, సంగీతా యాదవ్ జాతీయ కార్యదర్శులుగా, రేఖా వర్మ, డాక్టర్ తారిఖ్ మన్సూర్ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. అమర్‌పాల్ మౌర్యకు జాతీయ ఓబీసీ మోర్చా, కున్వర్ వాషిత్ అలీకి జాతీయ మైనారిటీ మోర్చా బాధ్యతలు అప్పగించారు. యూపీకి ఇంతటి ప్రాధాన్యం దక్కడానికి ప్రధాన కారణం రెండువేల ఇరవై ఏడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలేనన్నది రాజకీయ విశ్లేషణ. దేశ రాజకీయాలను ప్రభావితం చేసే అతిపెద్ద రాష్ట్రంలో ఎన్నికలకు ముందే సామాజిక, రాజకీయ సమీకరణాలను బలోపేతం చేయాలన్న లక్ష్యంతోనే ఈ కూర్పు జరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇదే సమయంలో తెలంగాణకు పూర్తిగా ప్రాతినిధ్యం లేకపోవడం రాష్ట్ర పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

**రాష్ట్రంలో బలమైనా..**
**జాతీయ బృందంలో దూరం**

తెలంగాణలో బీజేపీ గత కొన్నేళ్లుగా తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకుంటూ వచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లోనూ పార్టీ బలమైన ఫలితాలు సాధించింది. రాష్ట్రంలో పార్టీకి ఓటుబ్యాంకు, కేడర్ పెరుగుతున్న నేపథ్యంలో జాతీయ స్థాయిలో తెలంగాణకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని ఆశించిన నాయకులకు తాజా కూర్పు కొంత నిరాశ కలిగించే అంశంగా మారిందన్న చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఓబీసీ రాజకీయాల్లో తెలంగాణకు చెందిన డాక్టర్ కే. లక్ష్మణ్ జాతీయ స్థాయిలో కీలకంగా ఉన్న సమయంలో రాష్ట్ర పార్టీకి ఒక ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. ఇప్పుడు ఆయన స్థానంలో యూపీ నేతకు బాధ్యతలు అప్పగించడంతో తెలంగాణ స్థానాన్ని యూపీ భర్తీ చేసినట్టయిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఇది తెలంగాణకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయమని చెప్పడానికి ఆధారాలు లేవు. జాతీయ నాయకత్వం ఎన్నికల ప్రాధాన్యాలు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఈ కూర్పు చేసినట్లు కనిపిస్తోంది.

**తెలంగాణపై జాతీయ నాయకత్వం లెక్కేంటి?**

కొత్త జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నుంచి ఒక్కరికీ చోటు దక్కకపోవడంపై ఇప్పుడు ప్రధానంగా ఇదే ప్రశ్న వినిపిస్తోంది. రాష్ట్రంలో పార్టీ విస్తరణకు కృషి చేసిన సీనియర్ నాయకులు, వివిధ సామాజిక వర్గాల్లో ప్రభావం ఉన్న నేతలు ఉన్నప్పటికీ జాతీయ బృందంలో ఎవరికీ అవకాశం దక్కకపోవడం వెనుక జాతీయ నాయకత్వం ఆలోచన ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన దశలో జాతీయ కార్యవర్గంలో తెలంగాణ ప్రాతినిధ్యం లేకపోవడం కేడర్‌కు ఎలాంటి సంకేతం ఇస్తుందన్న చర్చ కూడా జరుగుతోంది. అయితే జాతీయ కార్యవర్గంలో పదవి దక్కకపోవడాన్ని రాష్ట్ర నాయకుల రాజకీయ ప్రాధాన్యం తగ్గినట్లుగా చూడాలా? లేక జాతీయ రాజకీయ అవసరాల మేరకు జరిగిన తాత్కాలిక కూర్పుగా పరిగణించాలా? అన్నది కాలమే తేల్చాల్సి ఉంది.

# ఓటర్ల జాబితాలో మీ పేరు ఉందా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక జాబితాలో చేర్చారు. మరో 61.4 లక్షల దరఖాస్తుల్లో లోపాలు ఉన్నట్లు, 32.3 లక్షల మంది వివరాలు పాత జాబితాలతో సరిపోలని మ్యాపింగ్ కాని ఓటర్లుగా గుర్తించారు. ఈ రెండు విభాగాలకు చెందిన దాదాపు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నారు. రాష్ట్రంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 36,353కు పెరగడంతో చాలా మంది ఓటర్లకు పాత బూత్ నంబర్లు మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఓటర్లు ముందుగా తమకు కేటాయించిన కొత్త పోలింగ్ కేంద్రాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఓటరు గుర్తింపు కార్డు నంబర్ లేదా పేరు, బంధువుల పేరు, పుట్టిన తేదీ వివరాలతో ఎన్నికల సంఘం శోధన పోర్టల్‌లో పరిశీలించుకోవచ్చన్నారు. అనంతరం సంబంధిత పోలింగ్ కేంద్రానికి చెందిన ముసాయిదా జాబితాను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

**అభ్యంతరాలకు అవకాశం**

ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. జాబితాలో పేరు లేకపోతే తగిన ధ్రువపత్రాలతో ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నోటీసులు అందుకున్నవారు నిర్ణీత గడువులోగా స్పందించాలని కోరారు. అక్టోబర్ 15 నాటికి అందిన దరఖాస్తులను పరిష్కరించి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు.

# ‘మీటికెట్’తో సమగ్ర ప్రయాణ సేవలు



- ఆర్టీసీ, మెట్రో, ఆటో, క్యాబ్.. అన్నీ ఒకే యాప్‌లో!
- ఒకే యాప్‌తో బహుళ రవాణా మార్గాల బుకింగ్


**కాకతీయ, హైదరాబాద్:** ప్రయాణికులకు మరింత సులభతరమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు టీజీఎస్ ఆర్టీసీ మరో వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ప్రజా రవాణా వ్యవస్థను ఆధునీకరించే క్రమంలో మీసేవ ద్వారా ‘మీటికెట్ (MeeTicket)’ యాప్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఆర్టీసీ, మెట్రో, ఆటోలు, క్యాబ్‌లకు సంబంధించిన సేవలను ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకురావడమే ఈ యాప్ ప్రధాన లక్ష్యమని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. మీటికెట్ యాప్ ద్వారా ప్రయాణికులు ఆర్టీసీ లేదా మెట్రో టికెట్‌ను బుక్ చేసుకోవడంతో పాటు తమ గమ్యస్థానానికి చేరుకునేందుకు అవసరమైన ఆటో లేదా క్యాబ్‌ను కూడా ముందుగానే బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వివిధ రవాణా మార్గాల కోసం వేర్వేరుగా టికెట్లు, సేవలు వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా ఒకే యాప్ ద్వారా ప్రయాణాన్ని ప్లాన్ చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. ప్రయాణికులు చెల్లించిన రుసుమును సంబంధిత రవాణా విభాగాలు, భాగస్వాములకు ఎప్పటికప్పుడు ఆటోమేటిక్‌గా జమ చేసే ఆధునిక చెల్లింపు వ్యవస్థను కూడా యాప్‌లో అందుబాటులోకి తీసుకురానున్నారు.

**ఆటో, క్యాబ్ డ్రైవర్లకు భాగస్వామ్య అవకాశం**

మీటికెట్ ఉమ్మడి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌గా పనిచేయనుంది. ఆటో, క్యాబ్ డ్రైవర్లతో పాటు ఇతర రవాణా సేవలందించే వారు ఈ ప్లాట్‌ఫామ్‌లో భాగస్వాములుగా చేరి ప్రయాణికులకు నేరుగా సేవలు అందించవచ్చు. ప్రయాణికుడు తనకు కావాల్సిన రవాణా మార్గాన్ని ఎంచుకుని ఒకే యాప్ ద్వారా సమగ్ర ప్రయాణ సౌకర్యాన్ని పొందేలా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ‘ఆర్టీసీ సొంతంగా ఆటోలను కొనుగోలు చేసి నడపబోతోంది’ అంటూ ఇటీవల సోషల్ మీడియా, కొన్ని పత్రికలు, ఇతర వేదికల్లో జరుగుతున్న ప్రచారంపై టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం స్పష్టత ఇచ్చింది. ఆర్టీసీ స్వయంగా ఆటోలను కొనుగోలు చేయడం, నిర్వహించడం వంటి ప్రతిపాదన ఏదీ లేదని తేల్చిచెప్పింది. భవిష్యత్తులోనూ అలాంటి ఆలోచన లేదని పేర్కొంది. ఆర్టీసీ సొంతంగా ఆటోలను నడుపుతుందన్న ప్రచారాన్ని నమ్మవద్దని ప్రయాణికులు, ఆటో డ్రైవర్లకు యాజమాన్యం సూచించింది. ‘మీటికెట్’లో ఆటోలు, క్యాబ్‌లను భాగస్వామ్య సేవలుగా అనుసంధానించే విధానమే అమలులోకి రానుందని స్పష్టం చేసింది.

# ఒమన్‌కు ట్రంప్ హెచ్చరిక..
# అడ్డొస్తే బాంబులు వేస్తాం

**కాకతీయ, నేషనల్ డెస్క్ :** ఇరాన్‌తో కొనసాగుతున్న ఘర్షణ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒమన్‌కు తీవ్ర హెచ్చరిక చేశారు. హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా ప్రయత్నాలకు ఒమన్ అడ్డుగా వస్తే ఆ దేశంపై తీవ్రస్థాయిలో బాంబు దాడులు చేస్తామని సోమవారం ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలను నిర్వహించే అంశంపై ఇరాన్, ఒమన్ అధికారులు చర్చలు జరుపుతున్న సమయంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. జలసంధి ద్వారా వాణిజ్య నౌకల రాకపోకలకు సంబంధించి తాత్కాలిక ఏర్పాటుపై ఇరాన్ దౌత్యవేత్తలు ఒమన్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన 60 రోజుల చర్చల గడువు సోమవారంతో ముగియనున్న నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మధ్యప్రాచ్య ఉద్రిక్తతల్లో హర్మూజ్ జలసంధి కీలక కేంద్రంగా మారడంతో ఒమన్‌పై ట్రంప్ చేసిన హెచ్చరిక ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉందని విశ్లేషణలు వెలువడుతున్నాయి.



కాకతీయ

# టీజీఎండీసీ పీవోల బదిలీలు




**ఇసుక నిర్వహణపై పర్యవేక్షణకు జిల్లాల పునర్విభజన**
**పలువురికి అదనపు బాధ్యతలు.. మరికొందరికి కొత్త జిల్లాలు**
**శంకర్‌నాయక్, బి.రాజు మాతృసంస్థలకు**
**వికారాబాద్ బాధ్యతల నుంచి రాకేష్‌కుమార్ రిలీవ్**
**తక్షణమే కొత్త బాధ్యతలు చేపట్టాలని ఆదేశాలు**

కాకతీయ, తెలంగాణ బ్యూరో : ఇసుక నిర్వహణ కార్యకలాపాలపై సమర్థవంతమైన పర్యవేక్షణ, కార్యాచరణ నియంత్రణ కోసం తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్టు అధికారుల జిల్లా బాధ్యతలను పునర్విభజించింది. పలువురు ప్రాజెక్టు అధికారుల పరిధిలో మార్పులు చేస్తూ, కొందరికి అదనపు జిల్లాల బాధ్యతలు అప్పగించింది. మరికొందరికి కొత్త జిల్లాలను కేటాయించగా, ఇద్దరు అధికారులను వారి మాతృసంస్థలకు తిరిగి పంపించింది. ఈ మేరకు టీజీఎండీసీ ఈ నెల 13న కార్యాలయ ఉత్తర్వులు జారీ చేసింది. మార్పులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. ములుగు, హనుమకొండ, వరంగల్ జిల్లాల బాధ్యతలు నిర్వహిస్తున్న వి.వెంకటేశ్వర్లుకు ఎలాంటి మార్పు చేయలేదు. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల బాధ్యతలు చూస్తున్న పి.శ్రీనివాస్‌కు అదనంగా మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. పెద్దపల్లి జిల్లా బాధ్యతను విష్ణువర్ధన్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల బాధ్యతలను హెచ్.వినయ్‌కుమార్ కొనసాగించనున్నారు. మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల బాధ్యతలు నిర్వహిస్తున్న రాకేష్‌కుమార్ పరిధి నుంచి వికారాబాద్ జిల్లాను తొలగించారు. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల బాధ్యతలు నిర్వహిస్తున్న జి.శంకర్‌నాయక్‌ను మాతృసంస్థకు తిరిగి పంపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాధ్యతను దశరథంకు కేటాయించారు.

### జయశంకర్ భూపాలపల్లి బాధ్యతలు మార్పు

జయశంకర్ భూపాలపల్లి బాధ్యతలు నిర్వహిస్తున్న పి.రామకృష్ణకు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలను కేటాయించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా బాధ్యతను డి.రవీందర్‌కు అప్పగించారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల బాధ్యతలు నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్‌కు వికారాబాద్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలను కేటాయించారు. మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల బాధ్యతలు నిర్వహిస్తున్న మదన్‌మోహన్‌గౌడ్‌కు నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాలను అప్పగించారు.

### వెంటనే కొత్త బాధ్యతలు చేపట్టాలి

కొత్తగా జిల్లాల బాధ్యతలు పొందిన అధికారులు తమ ప్రస్తుత బాధ్యతల నుంచి వెంటనే రిలీవ్ అయి, కేటాయించిన జిల్లాల్లో బాధ్యతలు స్వీకరించాలని టీజీఎండీసీ ఆదేశించింది. కొత్తగా నియమితులైన అధికారులు కూడా ఎలాంటి జాప్యం లేకుండా బాధ్యతలు చేపట్టాలని స్పష్టం చేసింది. జి.శంకర్‌నాయక్, బి.రాజులను జిల్లా బాధ్యతల నుంచి రిలీవ్ చేసి వారి మాతృసంస్థలకు పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

### రికార్డుల అప్పగింతపై స్పష్టమైన ఆదేశాలు

బాధ్యతల అప్పగింతలో భాగంగా ఆయా జిల్లాలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, ఫైళ్లు, ఇసుక రీచ్‌లు, స్టాక్‌యార్డులు, వాహనాలు, పరికరాలు, పెండింగ్ కేసులు, ఆర్థిక వ్యవహారాలు, భద్రతా ఏర్పాట్లు, సమాచార సాంకేతిక వ్యవస్థలు, సీసీటీవీ వ్యవస్థలు, ఇతర ఆస్తులు, సమాచారాన్ని పూర్తిగా అప్పగించాలని ఆదేశించింది. రిలీవింగ్, బాధ్యతల స్వీకరణకు సంబంధించిన నివేదికలను సంతకాలతో ప్రధాన కార్యాలయానికి సమర్పించాలని పేర్కొంది. ఈ మార్పులు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు అమల్లో ఉంటాయని టీజీఎండీసీ స్పష్టం చేసింది. ఇసుక నిర్వహణలో జిల్లా స్థాయిలో పర్యవేక్షణను మరింత సమర్థవంతం చేయడం, పరిపాలనా సౌలభ్యం, కార్యకలాపాలపై నియంత్రణను పెంచడం లక్ష్యంగా ఈ పునర్విభజన చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

# టికెట్ చిచ్చు.. బహిరంగ పోరు!

- వనపర్తి కాంగ్రెస్‌లో రెండు వర్గాల పోరు
- మేఘారెడ్డిపై చిన్నారెడ్డి సంచలన ఆరోపణలు
- డబ్బులిచ్చి టికెట్ తెచ్చుకున్నట్లు నిరూపించాలి
- చిన్నారెడ్డికి మేఘారెడ్డి ఘాటు కౌంటర్
- అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానంటూ ప్రకటన



కాకతీయ, వనపర్తి : వనపర్తి కాంగ్రెస్‌లో చాలాకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు ఇప్పుడు బహిరంగ పోరుగా మారాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, సీనియర్ నేత జి.చిన్నారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు.. వాటికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఇచ్చిన కౌంటర్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల టికెట్ వ్యవహారాన్ని కేంద్రంగా చేసుకుని ఇద్దరు నేతలు పరస్పరం విమర్శలు చేసుకోవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో కలకలం మొదలైంది. ఇన్నాళ్లూ తెరవెనుక సాగిన ఆధిపత్య పోరు ఇప్పుడు వేదికలెక్కిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2023 ఎన్నికల్లో వనపర్తి కాంగ్రెస్ టికెట్ కోసం చిన్నారెడ్డి, మేఘారెడ్డి మధ్య పోటీ నెలకొంది. తొలుత చిన్నారెడ్డికి టికెట్ ఖరారైనట్లు ప్రచారం జరిగినా.. చివరి నిమిషంలో అధిష్ఠానం మేఘారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. ఆయన ఎన్నికల్లో విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచే ఇరువర్గాల మధ్య రాజకీయ దూరం కొనసాగుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ ఉంది. తాజాగా గోపాల్‌పేటలో జరిగిన కాంగ్రెస్ కార్యక్రమంలో చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ విభేదాలకు మరింత ఆజ్యం పోశాయి. డబ్బులు ఇచ్చి టికెట్ తెచ్చుకున్నారని మేఘారెడ్డిపై ఆయన ఆరోపించారు. తనకు టికెట్ ఇవ్వాలని పార్టీ నిర్ణయించినా.. కొందరు డబ్బులకు ఆశపడి ఆ నిర్ణయాన్ని మార్చించారని వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో తన వర్గం నేతలు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కూడా విమర్శించారు.

### 'ఆధారాలతో నిరూపించండి'

చిన్నారెడ్డి ఆరోపణలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి అదే స్థాయిలో స్పందించారు. తాను డబ్బులు ఇచ్చి టికెట్ తెచ్చుకున్నానని ఆరోపిస్తున్న వారు.. ఎవరికి, ఎప్పుడు, ఎంత డబ్బు ఇచ్చానో ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. పార్టీ నిర్వహించిన సర్వేలు, అభ్యర్థుల గెలుపు అవకాశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే అధిష్ఠానం తనకు టికెట్ ఇచ్చిందని చెప్పారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకోవడానికి సిద్ధమని మేఘారెడ్డి ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. ఈ వ్యవహారాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు.

### పాత మాటలు.. కొత్త రాజకీయాలు

చిన్నారెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా మేఘారెడ్డి ప్రస్తావించారు. 2014, 2018 ఎన్నికల సమయంలో ఇకపై తాను పోటీ చేయబోనని, పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా వారి గెలుపు కోసం పనిచేస్తానని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలకు అప్పటి వ్యాఖ్యలకు పొంతన లేదని ప్రశ్నించారు. మరోవైపు నియోజకవర్గ అభివృద్ధి పనుల విషయంలోనూ ఇరువర్గాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఐటీ టవర్, విద్యార్థుల వసతిగృహాలు, మార్కెట్ తదితర అంశాలపై చిన్నారెడ్డి విమర్శలు చేయడం.. వాటికి ఎమ్మెల్యే వర్గం నుంచి ప్రతిస్పందనలు రావడం చాలాకాలంగా జరుగుతోంది. వనపర్తిలో సీనియర్ నేత, సిట్టింగ్ ఎమ్మెల్యే వర్గాల మధ్య విభేదాలు బహిరంగం కావడంతో కాంగ్రెస్ అధిష్ఠానానికి కొత్త తలనొప్పి మొదలైనట్లయింది. ఇరువర్గాలకు చెందిన నేతలు, కార్యకర్తలు ఎవరికి మద్దతుగా నిలుస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వచ్చే రోజుల్లో నియోజకవర్గ పార్టీ కార్యక్రమాల్లో ఈ విభేదాల ప్రభావం ఎలా ఉంటుందన్న చర్చ సాగుతోంది. టికెట్ వ్యవహారంతో మొదలైన అసంతృప్తి.. ఆధిపత్య పోరుగా మారి.. ఇప్పుడు బహిరంగ ఆరోపణలు, సవాళ్లకు దారితీసింది. ఇద్దరు నేతలు ఒకే పార్టీలో ఉన్నా రాజకీయంగా మాత్రం దూరం పెరుగుతుండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుంటుందా? లేక వివాదం మరింత ముదురుతుందా? అన్నది వనపర్తి రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

# అక్రమాల పీవోకు చెక్

- ఎట్టకేలకు భద్రాద్రి పీవో శంకర్ నాయక్‌కు ఉద్వాసన
- టీజీఎండీసీ నుంచి మాతృసంస్థకు బదిలీ
- ఏళ్లుగా కీలక బాధ్యతల్లో కొనసాగిన అధికారిపై ఆరోపణలు
- ఇసుక కాంట్రాక్టర్ శ్రీకర్‌కు సహకరించారనే విమర్శలు
- బీటీపీఎస్ ఇసుక లెక్కలు బయటపెట్టేదెప్పుడు?
- ఆర్టీఐ దరఖాస్తులపైనా అధికారుల మౌనం
- పాత వ్యవహారాలపై ఇప్పుడు టీజీఎండీసీలో చర్చ

కాకతీయ, తెలంగాణ బ్యూరో : ఎట్టకేలకు టీజీఎండీసీలో ఏళ్లుగా కీలక బాధ్యతలు నిర్వహించిన జి.శంకర్‌నాయక్‌ను మాతృసంస్థకు పంపించారు. గతంలో భద్రాద్రి కొత్తగూడెం పీవోగా పనిచేసిన శంకర్‌నాయక్‌ను తాజాగా భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల పీవో బాధ్యతల నుంచి తప్పించి మాతృసంస్థకు బదిలీ చేశారు. ఇసుక వ్యవహారాల్లో శంకర్‌నాయక్‌పై చాలాకాలంగా ఆరోపణలు, విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈ బదిలీ ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా ఇసుక కాంట్రాక్టర్ శ్రీకర్ వ్యవహారాలకు శంకర్‌నాయక్ సహకరించారన్న ఆరోపణలు, ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం చేరేలా చేశారన్న విమర్శలు, మణుగూరు బీటీపీఎస్ టౌన్ నిర్మాణానికి తరలించిన ఇసుకకు సంబంధించిన లెక్కలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో బయటకు రాకపోవడం వంటి అంశాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. శ్రీకర్ ఇసుక కాంట్రాక్టర్‌గా భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతంలో తన ప్రభావాన్ని పెంచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రీచ్‌లు, ఇసుక రవాణా, స్టాక్‌యార్డుల వ్యవహారాలను తనకు అనుకూలంగా నడిపించేందుకు ప్రయత్నించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో అప్పట్లో భద్రాద్రి కొత్తగూడెం పీవోగా పనిచేసిన శంకర్‌నాయక్ సహకరించారన్న ఆరోపణలు టీజీఎండీసీ వర్గాల్లో చాలాకాలంగా చర్చలో ఉన్నాయి. డిపార్ట్‌మెంట్ బదిలీల్లో భాగంగా శంకర్‌నాయక్‌ను హెడ్ ఆఫీసుకు కేటాయించిన తర్వాత కూడా ఆయన తిరిగి భద్రాద్రి కొత్తగూడెం పీవోగా రావడం అప్పట్లో చర్చకు దారితీసింది. శ్రీకర్ తన పలుకుబడిని ఉపయోగించి శంకర్‌నాయక్‌ను డిప్యూటేషన్‌పై తిరిగి తీసుకువచ్చారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ జరగలేదు. ఇసుక కాంట్రాక్టర్ శ్రీకర్ రీచ్‌లు, రవాణా, స్టాక్‌యార్డుల వ్యవహారాల్లో ప్రభావం చూపించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయనకు శంకర్‌నాయక్ సహకారం అందించారన్న విమర్శలు వచ్చాయి. ఇసుక దొంగతనం విస్తృతంగా సాగిన సమయంలో ఇద్దరి మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని టీజీఎండీసీ వర్గాల్లో చర్చ జరిగినట్లు సమాచారం. శంకర్‌నాయక్ భద్రాద్రి కొత్తగూడెం పీవోగా పనిచేసిన కాలానికి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తే ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### బీటీపీఎస్ ఇసుక లెక్కలపై ప్రశ్నలు

మణుగూరు బీటీపీఎస్ టౌన్ నిర్మాణానికి తరలించిన ఇసుక వ్యవహారంపై కాకతీయ ఇప్పటికే పరిశోధనాత్మక కథనాలు ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. అయితే బీటీపీఎస్‌కు ఏ క్వారీ నుంచి ఎంత పరిమాణంలో ఇసుక తరలించారు? ఎంత ఇసుకకు అనుమతి ఇచ్చారు? వాస్తవంగా ఎంత తరలించారు? ఎన్ని వాహనాలను వినియోగించారు? రవాణాకు సంబంధించిన రికార్డులు ఏమిటి? రాయల్టీ, ఇతర చెల్లింపులు ఎంత జరిగాయి? టీజీఎండీసీకి ఎంత ఆదాయం వచ్చింది? అనే వివరాలు ఇప్పటికీ పూర్తిగా బయటకు రాలేదు. అప్పట్లో పీవోగా పనిచేసిన శంకర్‌నాయక్‌తోపాటు సంబంధిత అధికారులు ఈ లెక్కలను బహిర్గతం చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇసుక తరలింపులో ఎలాంటి అక్రమాలు జరగలేదంటే క్వారీ వారీగా, పరిమాణం వారీగా పూర్తి వివరాలను వెల్లడించేందుకు అభ్యంతరం ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి. బీటీపీఎస్ నిర్మాణానికి తరలించిన ఇసుకకు సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తే అసలు వ్యవహారం ఏమిటన్నది తేలే అవకాశం ఉంది.

### ఆర్టీఐలపై మౌనం ఎందుకు?

బీటీపీఎస్ ఇసుక తరలింపునకు సంబంధించిన వివరాల కోసం సమాచార హక్కు చట్టం కింద దాఖలైన దరఖాస్తులకు అధికారులు పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఏ క్వారీ నుంచి ఎంత ఇసుక తరలించారు, అనుమతులు ఎవరు ఇచ్చారు, రవాణా ఎలా జరిగింది, చెల్లింపులు ఎంత జరిగాయి వంటి వివరాలను కోరినా సమగ్ర సమాచారం అందలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సంస్థకు సంబంధించిన ఇసుక రీచ్‌లు, రవాణా, చెల్లింపుల రికార్డులు అందుబాటులో ఉంటే వాటిని వెల్లడించడంలో ఇబ్బంది ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆర్టీఐ దరఖాస్తులను పక్కన పెట్టడం వల్లే ఏదో దాచాల్సిన వ్యవహారం ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయని విమర్శకులు అంటున్నారు. రీచ్‌ల నుంచి బయటకు వెళ్లిన ఇసుక పరిమాణం, అధికారిక రికార్డుల్లో నమోదైన పరిమాణం ఒకటేనా? స్టాక్‌యార్డుల్లో నమోదైన నిల్వలు, వాస్తవ నిల్వలు సరిపోతున్నాయా? అన్నది తేలాల్సి ఉంది.

### పాత రికార్డులపైనే ఇప్పుడు దృష్టి

శంకర్‌నాయక్ బాధ్యతల మార్పిడి సమయంలో ఇసుక రీచ్‌లు, స్టాక్‌యార్డులు, వాహనాలు, పరికరాలు, పెండింగ్ కేసులు, ఆర్థిక వ్యవహారాలు, భద్రతా ఏర్పాట్లు, సమాచార సాంకేతిక వ్యవస్థలు, సీసీటీవీ వ్యవస్థలు సహా అన్ని రికార్డులను పూర్తిగా అప్పగించాలని టీజీఎండీసీ ఉత్తర్వుల్లో పేర్కొంది. రిలీవింగ్, బాధ్యతల స్వీకరణకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని కూడా ఆదేశించింది. ఈ నేపథ్యంలో శంకర్‌నాయక్ భద్రాద్రి కొత్తగూడెం పీవోగా పనిచేసిన కాలానికి సంబంధించిన ఫైళ్లు కీలకంగా మారాయి. రీచ్‌ల అనుమతులు, ఇసుక తరలింపు, స్టాక్‌యార్డుల నిల్వలు, రవాణా, రాయల్టీ, బిల్లులు, పెండింగ్ కేసులు, బీటీపీఎస్‌కు తరలించిన ఇసుకకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తే ఇప్పటివరకు వెలుగులోకి రాని అంశాలు బయటపడే అవకాశం ఉంది. బాధ్యతలు అప్పగించే సమయంలో ఏ రికార్డులు సమర్పించారు? ప్రభుత్వానికి ఎంత ఆదాయం వచ్చింది? అన్న వివరాలు కూడా పరిశీలించాల్సి ఉంది.

### మాతృ సంస్థకు బదిలీతో కొత్త చర్చ

భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల పీవో బాధ్యతల నుంచి శంకర్‌నాయక్‌ను తప్పించి మాతృసంస్థకు పంపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాధ్యతలను దశరథంకు అప్పగించారు. ఈ మార్పులు తక్షణమే అమల్లోకి వస్తాయని టీజీఎండీసీ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఎట్టకేలకు శంకర్‌నాయక్‌ను టీజీఎండీసీ నుంచి మాతృసంస్థకు పంపగలిగారన్న చర్చ ఇప్పుడు ఆ సంస్థలోనే జరుగుతోంది. అయితే బదిలీతో పాత ఆరోపణలకు తెరపడుతుందా? లేక శంకర్‌నాయక్ పీవోగా పనిచేసిన కాలానికి సంబంధించిన రికార్డులపై ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలన చేపడతారా? అన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా బీటీపీఎస్ ఇసుక తరలింపునకు సంబంధించిన అసలు లెక్కలు బయటకు వస్తాయా? ఆర్టీఐల్లో అడిగిన సమాచారాన్ని అధికారులు వెల్లడిస్తారా? అన్న ప్రశ్నలు మిగిలే ఉన్నాయి. శంకర్‌నాయక్ మాతృసంస్థకు వెళ్లడంతో వ్యవహారం ముగిసినట్టేనా, లేక పాత ఇసుక లెక్కలపై ఉన్నతాధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారా అన్నదే ఇప్పుడు టీజీఎండీసీలో ఆసక్తికరంగా మారింది.

# జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి

- రూ.15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- 3,245 ఎకరాల్లో పారిశ్రామిక నగర అభివృద్ధి
- 2028 మార్చి నాటికి పనులన్నీ పూర్తి
- నీటి సరఫరా టెండర్ల ప్రక్రియ పూర్తి
- తెలంగాణకు 4 ప్లగ్ అండ్ ప్లే పార్కులు ఇవ్వాలి
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కాకతీయ, హైదరాబాద్ : జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక వాడలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అభివృద్ధి పనులన్నీ 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్ న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్సులో మంత్రి శ్రీధర్‌బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల మంత్రులు సమావేశంలో పాల్గొన్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో రాష్ట్రప్రభుత్వం వాటా 51శాతం ఉండగా, అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే ప్రయోజన వాహనం సంస్థకు అభివృద్ధి ప్రణాళికను అందజేశామని చెప్పారు. ఇంజినీరింగ్, సేకరణ, నిర్మాణ పద్ధతిలో జరుగుతున్న పనులను ముందుగా నిర్ణయించిన గడువులోగా పూర్తి చేస్తామని వెల్లడించారు.

### మౌలిక వసతుల పనులు గడువులోగా

స్మార్ట్ సిటీకి నీటి సరఫరా పనుల టెండర్ల ప్రక్రియ పూర్తయిందని శ్రీధర్‌బాబు తెలిపారు. విద్యుత్తు సరఫరా పనులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని చెప్పారు. పారిశ్రామిక సంస్థలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. భవ్య పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్‌ను శ్రీధర్‌బాబు కోరారు. తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రం మరింత సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వీడియో కాన్ఫరెన్సులో టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీలో టి-వర్క్స్ తరహా సంస్థ

అధికారిక పర్యటనలో భాగంగా సోమవారం హైదరాబాద్‌కు వచ్చిన న్యూఢిల్లీ పరిశ్రమల మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్ సిర్సాకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఢిల్లీలో టి–వర్క్స్ తరహా సంస్థను ఏర్పాటు చేసేందుకు సహకరించాలని సిర్సా, శ్రీధర్‌బాబును కోరారు.36

# కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే

- వందేమాతరాన్ని అవమానించడం సిగ్గుచేటు
- సోనియా, ఖర్గే చరిత్ర తెలుసుకోవాలి
- బీఆర్ఎస్ అవినీతి కేసులు ఎందుకు మూసివేస్తున్నారు
- ఆరు గ్యారంటీలకు అడ్రస్ లేదు
- తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారే లక్ష్యం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కాకతీయ, తిరుపతి : వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ అవమానించడం సిగ్గుచేటని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని నింపిన వందేమాతరం చరిత్రను సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే తెలుసుకోవాలని సూచించారు. దేశం మారితే సరిపోదని, దేశ విలువలు, సంస్కృతి, వేల ఏళ్ల చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి పట్టణంలో టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్‌తో కలిసి బండి సంజయ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. వందేమాతరం గీతాన్ని విని బ్రిటిష్ పాలకులు ఆనాడు భయపడ్డారని, ఇప్పుడు వందేమాతరం పూర్తి గీతాన్ని చూసి కాంగ్రెస్ వణుకుతోందని విమర్శించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదని, ఇటలీ నేషనల్ కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. వందేమాతరాన్ని కాంగ్రెస్ అవమానించడంపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### విపక్షాల మాటలు నమ్మొద్దు

నీట్ వ్యవహారంలో దోషులను అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారని బండి సంజయ్ తెలిపారు. మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించి ఫలితాలను కూడా వెల్లడించామని చెప్పారు. విపక్షాలు విద్యార్థుల్లో విషబీజాలు నాటుతున్నాయని ఆరోపించారు. వారి మాటల్లోని అంతరార్థాన్ని యువత గ్రహించాలని, వాస్తవాలను తెలుసుకోకపోతే విద్యార్థులు మోసపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎన్నటికీ ఒక్కటి కావని బండి సంజయ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని ఆరోపించారు. గతంలో రెండు పార్టీలు కలిసి పోటీ చేసి అధికారం పంచుకున్నాయని, ప్రస్తుతం కూడా వాటి మధ్య లోపాయికారీ ఒప్పందం కొనసాగుతోందని విమర్శించారు. అందుకే బీఆర్ఎస్ అవినీతి కేసులన్నీ అటకెక్కాయని ఆరోపించారు.

### అవినీతి కేసులు ఏటీఎంలుగా మారాయి

బీఆర్ఎస్ అవినీతి కేసులు కాంగ్రెస్‌కు ఏటీఎంలుగా మారాయని బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ అవినీతి బయటకు వచ్చినప్పుడల్లా కాంగ్రెస్ నేతలకు మూటలు అందుతున్నాయని, ఆ మూటలు అందగానే కేసులు ఒక్కొక్కటిగా మూసివేస్తున్నారని విమర్శించారు. సిట్‌కు అప్పగించిన కేసులన్నీ సీఎం సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్ అన్నట్టుగా మారాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు అడ్రస్ లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పే రోజులు రాబోతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, అప్పులు తీరడంతో పాటు అభివృద్ధి జరగాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని అన్నారు. తెలంగాణలో బీజేపీ సింగిల్‌గా పోటీ చేసి అధికారంలోకి వస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు.

ఉత్తరం కాకతీయ

# కేసీఆర్ హయాంలో అన్ని వర్గాలకు సంక్షేమం

అభివృద్ధి పనులన్నీ బీఆర్ఎస్ హయాంలోనే

420 హామీలు అమలు చేయకుండా మూడేళ్లు గడిపారు

ప్రజలను మభ్యపెడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం

మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్ భాస్కర్

పరకాలకు ఏం చేశావు : మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



కాకతీయ, వరంగల్ బ్యూరో : ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూడేళ్లు గడిపిందని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి వినయ్ భాస్కర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ పెద్దగా ఆలోచిస్తూ అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలనే లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో దళిత బంధు పథకాన్ని అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని వినయ్ భాస్కర్ అన్నారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ పథకాలను నిలిపివేయాలని చూస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కల్యాణలక్ష్మి పథకంపై కోర్టులో కేసు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు సమర్థవంతంగా కౌంటర్ దాఖలు చేయలేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నిర్మాణం చేపట్టిన హనుమకొండ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభించిందని వినయ్ భాస్కర్ అన్నారు. తాము ప్రారంభించిన పనులను పూర్తి చేసి తమ ఘనతగా చెప్పుకోవడం తప్ప కొత్తగా చేపట్టిన అభివృద్ధి ఏమిటో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేసి సాధించుకున్నామని తెలిపారు.

## పరకాలకు ఏం చేశావు : మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ను విమర్శించడం తప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరకాల నియోజకవర్గానికి ఏం ఇచ్చి వెళ్లారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చినట్లు చెప్పుకోవడం సరికాదన్నారు. రైతులకు సమయానికి యూరియా అందించలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. పరకాల పర్యటనలో స్థానిక ఎమ్మెల్యే పేరును కూడా సీఎం మరిచిపోయారని ఎద్దేవా చేశారు. పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి పర్యటనల పేరుతో నిర్వహిస్తున్న సభలకు ప్రజాధనం వృథా అవుతోందని ధర్మారెడ్డి విమర్శించారు. వేదిక పక్కనే నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్‌ను సీఎం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. రైతులు, పేదలు, మహిళలు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం విఫలమైతే ప్రజాక్షేత్రంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# పీఏసీ భేటీకి రాజగోపాల్‌రెడ్డి దూరం

- భువనగిరిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం
- పార్టీ బలోపేతంపై నేతల సుదీర్ఘ చర్చ
- ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష
- కీలక భేటీకి ఎమ్మెల్యే గైర్హాజరు
- ముందస్తు సమాచారం లేకపోవడంపై అసంతృప్తి



కాకతీయ, భువనగిరి : కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గైర్హాజరు కావడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కీలక సమావేశానికి ఎమ్మెల్యే గైర్హాజరు కావడంపై పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. భువనగిరి పట్టణంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర మంత్రులు, నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నేతలు చర్చించినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడం, ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరింత చేరువ చేయడం వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం.

## సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

సకాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, వాటి అమలు తీరుపై సమావేశంలో సమీక్షించినట్లు తెలిసింది. ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా పార్టీ నాయకులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరంపై నేతలు చర్చించినట్లు సమాచారం. ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయ వ్యవహారాలపై కీలకంగా చర్చించే పీఏసీ సమావేశానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరుకాకపోవడం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా సమావేశానికి గైర్హాజరు కావడంపై మీనాక్షినటరాజన్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే రాజగోపాల్‌రెడ్డి గైర్హాజరుకు కారణాలు అధికారికంగా వెల్లడికాలేదు.

# సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ



కాకతీయ, పెద్దవంగర : సర్దార్ సర్వాయి పాపన్న పోరాటస్ఫూర్తి హర్షనీయమని కల్లు గీత కార్మికుల సంఘ అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు రమణ గౌడ్ అన్నారు. పెద్దవంగర మండల కేంద్రంలోని గట్లకుంట గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దా ర్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బహుజనుల ఆకాంక్షకు కుల వృత్తులందరిని కలుపుకొని వారి అభివృద్ధి కోసం పోరాటం చేసిన వ్యక్తి సర్వాయి పాపన్న అని కొనియాడారు. సర్వాయి పాపన్న చరిత్ర భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా ఆయన విగ్రహ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్ హైదరాబాద్ నడిబొడ్డున భూమి పూజ చేశారన్నారు. ఇలాంటి మహనీయుల అడుగుజాడల్లో ప్రభుత్వం ప్రజా పాలనను కొనసాగిస్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి బీసీల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నాడన్నారు. గ్రామ సర్పంచ్ ముత్తినేని యాకలక్ష్మి సోమన్న, కేజీకేస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు వెంకన్న, మండల చంద్రమౌళి గౌడ్, గ్రామ అధ్యక్షులు లచ్చయ్య గౌడ్, నాయకులు మల్లయ్య, వెంకన్న, యాకన్న, శ్రీను, పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ను కాపాడాలి



- పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా
- పథకాలను నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాలి
- పెండింగ్ సాయం వెంటనే విడుదల చేయాలి
- తులం బంగారం హామీ ఏమైంది
- హైకోర్టు కేసులో ప్రభుత్వం ఎందుకు స్పందించలేదు
- బీఆర్ఎస్ ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు

కాకతీయ, ఖమ్మం బ్యూరో : పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసి రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారులందరికీ వెంటనే ఆర్థిక సాయం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన తులం బంగారం హామీని ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టం చేయాలని కోరారు. సోమవారం బీఆర్ఎస్ ఖమ్మం నగర పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్, ఆంధ్రాబ్యాంక్ సొసైటీ చైర్మన్ బి.రెడ్డి నాగ చంద్రారెడ్డి, కర్నాటి కృష్ణ తదితరులు మాట్లాడారు.

## కేసీఆర్ హయాంలో పేదలకు అండ

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం ఆర్థిక భారంగా మారుతున్న విషయాన్ని గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం 2014 అక్టోబర్ 2న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించిందని నాయకులు గుర్తుచేశారు. ప్రారంభంలో రూ.51 వేలుగా ఉన్న సాయాన్ని దశలవారీగా రూ.75,116కు, అనంతరం రూ.1,00,116కు పెంచారని తెలిపారు. తొలుత ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు అమలు చేసిన పథకాలను అనంతరం బీసీ, ఈబీసీ వర్గాలకు విస్తరించారని పేర్కొన్నారు. సుమారు 13 లక్షల కుటుంబాలకు దాదాపు రూ.13 వేల కోట్ల ఆర్థిక సాయం అందించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని నాయకులు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా, ఇప్పటికే అమలులో ఉన్న పథకాల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. తులం బంగారం ఎప్పుడు ఇస్తారు, కల్యాణలక్ష్మి సాయం ఎప్పుడు అందిస్తారని పేదింటి ఆడబిడ్డలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని అన్నారు.

## పెళ్లయి పిల్లలు పుట్టినా సాయం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మంది అర్హులైన లబ్ధిదారులు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ సాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని నాయకులు తెలిపారు. కొందరికి పెళ్లయి పిల్లలు పుట్టినా సాయం అందకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఆమోదమైన దరఖాస్తులకు సంబంధించిన చెక్కుల పంపిణీలోనూ జాప్యం జరుగుతోందని విమర్శించారు. కల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం పలుమార్లు గడువు లభించినా కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. పేద ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన పథకంపై ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేదని నిలదీశారు. ఇతర కీలక కేసుల్లో ప్రైవేటు న్యాయవాదుల సేవలు తీసుకునే ప్రభుత్వం, కల్యాణలక్ష్మి విషయంలో ఎందుకు సరైన రీతిలో స్పందించలేదని ప్రశ్నించారు. పథకాలను రద్దు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని, పెండింగ్ సాయం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు కేసులో ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, తులం బంగారం హామీ అమలుపై ప్రకటన చేయాలని కోరారు. పేద కుటుంబాల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన పథకాలను కాపాడేందుకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు తోటా రామారావు, నాగండ్ల కోటి, మాటేటి నాగేశ్వరరావు, పల్లా రోస్‌లీనా, కూరాకుల వలరాజు, పసుమర్తి రాంమోహన్, బుర్రి వెంకట్, జ్యోతి రెడ్డి, మహ్మద్ తాజుద్దీన్, బుర్రి వినయ్, పాలడుగు పాపారావు, ఊటుకూరి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మిపై

# బీఆర్ఎస్ ఆందోళన

సీఎం దిష్టిబొమ్మ దహనం..

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

వినయ్ భాస్కర్ అరెస్ట్.. వరంగల్ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత



కాకతీయ, హనుమకొండ : కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి మహిళా కార్యకర్తలు, నాయకులు భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచిన పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వినయ్ భాస్కర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో కలెక్టరేట్ పరిసరాల్లో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులుబీఆర్ఎస్ శ్రేణులను చెదరగొట్టి వినయ్ భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.పరిస్థితిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## ఆగస్టు 18, 19 తేదీల్లో

# గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె

సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్త ఆందోళన



కాకతీయ, కారేపల్లి : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించే రాష్ట్రవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని కార్మికులు తెలిపారు. ఈ మేరకు సోమవారం సింగరేణి మండల ఎంపీవోకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ సింగరేణి మండల కన్వీనర్ కే. నరేంద్ర మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, రెండో పీఆర్సీలో చేర్చాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని కోరారు. సీఎం హామీ మేరకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల కార్యదర్శి ఎస్. నాగేశ్వరరావు, బోల్ల కొమరయ్య, పాలిక తిరపయ్య, యాదగిరి,ఉపేందర్,అచ్చయ్య,ఆధర్లశ్రీను,గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

బయోమెట్రిక్ హాజరుపై ఆరా.. సిబ్బంది సమయపాలనపై పరిశీలన

పారిశుధ్యం, చెత్త సేకరణ, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష

అర్జీదారులకు అందుబాటులో ఉండాలి : కలెక్టర్ కె. హైమావతి



కాకతీయ, చేర్యాల : చేర్యాల మున్సిపల్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది సమయపాలనపై ఆరా తీసిన కలెక్టర్.. బయోమెట్రిక్ హాజరు నమోదును పరిశీలించారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు, విధుల నిర్వహణ తీరును తనిఖీ చేశారు. మున్సిపాలిటీలో రోజువారీగా చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలు, ఇంటింటి చెత్త సేకరణ, ఇందిరమ్మ గృహాల నిర్మాణాలు, చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ తదితర పనుల పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయా కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని, పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలనిసూచించారు. ప్రజలనుంచి వచ్చేదరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిశీలించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజావాణిలో అధికారులకు జర్నలిస్టు సంఘాల వినతి

కాకతీయ, తుంగతుర్తి : ఏళ్లుగా ఎలాంటి జీతభత్యాలు లేకుండా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రభుత్వానికి–ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్న స్థానిక జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని టీయూడబ్ల్యూజే–ఐజేయు, టిడబ్ల్యూజెఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తుంగతుర్తి ప్రజావాణిలో తహసీల్దార్ దయానందం, ఎంపీడీవో ఉపేందర్‌రావులకు వినతిపత్రాలు అందజేశారు. జర్నలిజం వృత్తిని నమ్ముకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న పలువురు జర్నలిస్టులు సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానికంగా పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలను పరిశీలించి, ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. దీర్ఘకాలంగా జర్నలిజం రంగంలో సేవలందిస్తున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# కేటీఆర్ నేరాలు నిరూపితం.. శిక్ష తప్పదు

ఫార్ములా-ఈ కార్ రేసులో తప్పు చేశారు

మూసీ సుందరీకరణను కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు

తెలంగాణకు తెచ్చిన ప్రాజెక్టులపై చర్చకు సిద్ధం

బీసీ బిల్లుపై కేంద్రం సమాధానం చెప్పాలి: మహేశ్‌కుమార్‌గౌడ్

కాకతీయ, హైదరాబాద్ : ఫార్ములా–ఈ కార్ రేసు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పు చేశారని, ఆయన ముద్దాయిగా నిరూపితమయ్యారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఈ వ్యవహారంలో కేటీఆర్‌కు శిక్ష తప్పదని పేర్కొన్నారు. ఢిల్లీలో సోమవారం మీడియాతో మాట్లాడిన మహేశ్‌కుమార్‌గౌడ్.. ఫార్ములా–ఈ కార్ రేసులో కేటీఆర్ తప్పు చేశారని ఆరోపించారు. ఈ అంశంపై రాజకీయంగా కాకుండా వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని అన్నారు. మూసీ సుందరీకరణ కార్యక్రమాన్ని బీఆర్ఎస్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. అభివృద్ధి కార్యక్రమాల విషయంలో రాజకీయాలు చేయొద్దని సూచించారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీసుకొచ్చిన ప్రాజెక్టులపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన బీసీ బిల్లు కేంద్రం వద్ద ఎందుకు పెండింగ్‌లో ఉందో స్పష్టం చేయాలని మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చొరవ తీసుకుంటే బీసీ బిల్లుకు ఆమోదం లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీసీలకు న్యాయం చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించాలని కోరారు.

# ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలి

- గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలి
- అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించాలి
- అర్హులైన వారికి పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలి : మంత్రి సీతక్క ఆదేశం

కాకతీయ, ఏటూరునాగారం : ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాలు, హైదరాబాద్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే గ్రీవెన్స్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి పరిష్కారం చూపాలని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన మండల ప్రజావాణి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తుపై అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని మంత్రి సూచించారు. ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని ఆదేశించారు. అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించడంతో పాటు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలని, దరఖాస్తుదారులకు సమస్య పరిష్కార పురోగతిని తెలియజేయాలని సూచించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



### పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ

ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగుల పింఛన్ దరఖాస్తులను ఈ నెల 31లోగా స్వీకరించాలని మంత్రి ఆదేశించారు. అర్హులైన గీత కార్మికులు, నేత కార్మికులు, తలసేమియా బాధితులకు పింఛన్లు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని సీతక్క సూచించారు. పస్రా, గోవిందరావుపేట, చల్వాయి ప్రాంతాల్లో రహదారులు, గిరిజన తండాలు, గూడేల్లో మౌలిక వసతుల అభివృద్ధికి సుమారు రూ.50 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, తహసీల్దార్ సృజన్‌కుమార్, ఎంపీడీవో వరుణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కేటాయించిన ఇళ్లలో వెంటనే నివసించాలి

**మౌలిక వసతులు కల్పించడంలో జాప్యం చేయొద్దు**

**మిగతా బ్లాక్‌లకు వారం రోజుల్లో విద్యుత్ సౌకర్యం**

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచన**



కాకతీయ, హనుమకొండ : నిరుపేద కుటుంబాలకు సొంత ఇళ్లు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వెంటనే నివాసం ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. సోమవారం శాయంపేటలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల బ్లాక్‌లను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఇళ్ల సముదాయంలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, ఇళ్ల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లు మంజూరై, కేటాయింపు పూర్తయిన లబ్ధిదారులు ఇక ఆలస్యం చేయకుండా తమకు కేటాయించిన ఇళ్లలోకి వెళ్లి నివాసం ఉండాలని కోరారు. ప్రభుత్వం నిరుపేద కుటుంబాల కోసం నిర్మించి అందిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేటాయించిన ఇళ్లను ఖాళీగా ఉంచకుండా అర్హులైన లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

### మిగతా బ్లాక్‌లకు విద్యుత్ సౌకర్యం

శాయంపేటలో మొత్తం 19 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల బ్లాక్‌లు ఉండగా ప్రస్తుతం ఆరు బ్లాక్‌లకు మాత్రమే విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. మిగతా బ్లాక్‌లకు కూడా వారం రోజుల్లోగా విద్యుత్ సౌకర్యం కల్పించేలా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లేందుకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటులో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపు పూర్తయిన వెంటనే లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ పరిశీలనలో హౌసింగ్ పీడీ సిద్ధార్థ్ నాయక్, ఆర్ అండ్‌బీ ఈఈ, హౌసింగ్ ఏఈ, డీఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు కొనసాగించాలి



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: నెక్కొండ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలంటూ బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం ఆందోళన చేపట్టాయి. పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, సీనియర్ నాయకుడు కొమ్ము రమేష్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ హరికిషన్, నాయకులు రవి, వీరభద్రం, రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సీపీని కలిసిన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గం



కాకతీయ, వరంగల్ బ్యూరో: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఇటీవల ఎన్నికైన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కలను అందజేశారు. ఎన్నికల నోడల్ అధికారి, అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు. అధ్యక్షుడిగా కె. కరుణాకర్, ఉపాధ్యక్షులుగా బి. సతీష్, బి. శరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇ. వీరభద్రరావు, సంయుక్త కార్యదర్శిగా టి. నరేష్, కార్య నిర్వహణ కార్యదర్శిగా ఎస్. ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా బి. నరేష్ ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా ఎం. తులసి, సి.హెచ్. మహేందర్ యాదవ్, ఏ. రమేష్, ఎన్. ప్రవీణ్, ఎం.డి. తాజుద్దీన్, పి. సర్వేశ్ ఉన్నారు. నూతన కార్యవర్గానికి సీపీ అభినందనలు తెలిపి సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు నాగయ్య, సదయ్య, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల పెన్షన్లపై బీఆర్ఎస్ ఆందోళన



- మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు మంజూరు చేయాలి
- అర్హులైన వృద్ధాప్య బీడీ కార్మికులకు వెంటనే చేయూత అందించాలి
- స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం: మరుపల్ల రవి
- రెండో విడతకు కృషి.. కొత్త దరఖాస్తులకు సైట్ ఓపెన్ చేస్తాం : కమిషనర్ వెంకన్న

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పథకంలో అర్హులైన వృద్ధాప్య బీడీ కార్మికులకు వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్ ఎదుట ధర్నా నిర్వహించారు. 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో లబ్ధిదారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మరుపల్ల రవి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, నిరుపేదలకు పెన్షన్లు అందించడంపై మాత్రం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. సుమారు మూడేళ్ల క్రితం వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత, బీడీ కార్మికులు తదితర అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అప్పటి అధికారులు దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్నవాటిని ఆమోదించినప్పటికీ ఇప్పటివరకు పెన్షన్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారిని మళ్లీ దరఖాస్తులు చేసుకునేలా చేయడం ద్వారా ప్రభుత్వం లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు.

### అన్ని వర్గాలకూ పెన్షన్లు ఇవ్వాలి

అర్హత ఉన్న బీడీ కార్మికులతో పాటు వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని మరుపల్ల రవి డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకుల ఆందోళన విషయం తెలుసుకున్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న గ్రీవెన్స్ సెల్ నుంచి బయటకు వచ్చి ఆందోళనకారుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. పెన్షన్ల అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రెండో విడత పెన్షన్ల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే కొత్తగా అర్హత పొందిన వారు దరఖాస్తు చేసుకునేందుకు సైట్ ఓపెన్ చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మట్టెవాడ ఎస్సై సాంబయ్య ఆందోళనకారులతో మాట్లాడి శాంతింపజేయడంతో వారు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వనం కుమార్, మరుపల్ల గౌతం, పోలేపాక రాజన్, బాబు, అన్న శ్రీనివాస్, ఆవునూరు మల్లేశం, మంద బాబు, రాయబారపు కిషన్, పినగాని నాగేశ్వరరావు, వెంగళ సదానందం, కోరె సరోజన, కెంచ లక్ష్మి, వెంగళశకుంతల,ఆకుతోటవిజయతదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు విడుదల చేయాలి



### రైతు బీమా బకాయిలు చెల్లించాలి

### ఏటూరునాగారంలో బీఆర్ఎస్ ఆందోళన



కాకతీయ, ఏటూరునాగారం రూరల్ : కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, రైతు బీమా పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలు, జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు పిలుపు మేరకు ఎండీ ఖాజా పాషా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు నెలల తరబడి చెక్కులు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. రైతు బీమా కింద మరణించిన రైతుల కుటుంబాలకు పరిహారం అందక అన్యాయం జరుగుతోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన చేపడుతున్న ప్రతిపక్షాలను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. పెండింగ్‌లో ఉన్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు రైతు బీమా పరిహారాన్ని తక్షణమే లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఏటూరునాగారం నుంచే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేజీ వీల్స్ ట్రాక్టర్లపై నిఘా

- సమాచారం అందిస్తే రూ.5 వేల బహుమతి
- మంగపేట పంచాయతీ

కాకతీయ, ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ప్రధాన రహదారులను కాపాడేందుకు కేజీ వీల్స్‌తో రోడ్లపై తిరిగే ట్రాక్టర్లపై మంగపేట గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్లపై కేజీ వీల్స్‌తో ట్రాక్టర్లు నడిపే వారి సమాచారాన్ని ఫొటోలు, వీడియోలతో అందించిన వారికి రూ.5 వేల నగదు బహుమతి అందిస్తామని సోమవారం ప్రకటించారు. మండల కేంద్రంలో ఇటీవల కోట్లాది రూపాయలతో రోడ్ల విస్తరణ, ఆధునికీకరణతో పాటు సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టారు. అయితే కొందరు రైతులు కేజీ వీల్స్ అమర్చిన ట్రాక్టర్లను రోడ్లపై నడపడం వల్ల నూతనంగా నిర్మించిన రహదారులు దెబ్బతింటున్నాయని అధికారులు తెలిపారు. సాధారణంగా 20 ఏళ్ల వరకు మన్నిక ఉండాల్సిన రోడ్లు ఇలా దెబ్బతింటే తక్కువ కాలానికే మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. గంపోనిగూడెం క్రాస్, కోమటిపల్లి క్రాస్, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, జడ్పీ ఉన్నత పాఠశాల, పాత బస్టాండ్ చౌరస్తా, మహావీర్ వై జంక్షన్, వైఎస్సార్ సెంటర్ వరకు ప్రధాన రహదారులతో పాటు జాతీయ రహదారిపై కేజీ వీల్స్ ట్రాక్టర్ల కదలికలను గుర్తించాలని పంచాయతీ అధికారులు కోరారు. ట్రాక్టర్లకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను మంగపేట గ్రామపంచాయతీ గ్రూపులో లేదా పంచాయతీ కార్యదర్శి 8099963024 నంబర్‌కు పంపించి సమాచారం అందించాలని, వివరాలు అందించిన వారికి రూ.5 వేల బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

## నాటుసారాయి స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

**10 మందిపై కేసులు.. 9 మంది అరెస్ట్**

**46 లీటర్ల నాటుసారాయి, 1,250 లీటర్ల పానకం ధ్వంసం**

**చక్కెర, డ్రై ఈస్ట్, ద్విచక్ర వాహనం స్వాధీనం**

కాకతీయ, భూపాలపల్లి : నాటుసారాయి తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ కె. నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హెచ్. దత్తురాజ్‌గౌడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎక్సైజ్ అధికారి బి. కిరణ్ ఆదేశాల మేరకు కాటారం ఎక్సైజ్ స్టేషన్, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్, జిల్లా టాస్క్‌ఫోర్స్, భూపాలపల్లి స్టేషన్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మహాముత్తారం మండలంలోని కోర్లకుంట, దొబ్బలపాడు, మలహర్ మండలంలోని ఎడ్లపల్లి, కొండంపేట, కాటారం మండలంలోని గంగారం, చింతకాని గ్రామాల్లో నాటుసారాయి తయారీ స్థావరాలపై అధికారులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 10 మందిపై కేసులు నమోదు చేసి.. 9 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో 46 లీటర్ల నాటుసారాయి, 20 కిలోల చక్కెర, 2 కిలోల డ్రై ఈస్ట్, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. నాటుసారాయి తయారీకి సిద్ధంగా ఉంచిన 1,250 లీటర్ల చక్కెర పానకాన్ని అధికారులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నాటుసారాయి వల్ల కలిగే అనర్థాలు, ప్రజల ఆరోగ్యంపై పడే ప్రభావంపై ఎక్సైజ్ అధికారులు అవగాహన కల్పించారు. నాటుసారాయి తయారు చేసినా, రవాణా చేసినా, నిల్వ ఉంచినా లేదా విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో కాటారం ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాదావత్ కిష్టయ్య, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రాజసమ్మయ్య, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వర్‌రావు, చంద్రశేఖర్, భూపాలపల్లి ఎస్ఐ ఎస్‌కే. రబ్బానీతో పాటు హెడ్ కానిస్టేబుల్ గణేష్, కానిస్టేబుళ్లు కృష్ణ నాయక్, శ్రీనాథ్, హుస్సేన్, కుమార్ పాల్గొన్నారు.

## హనుమకొండ డీపీఆర్వోగా బండి పల్లవి బాధ్యతల స్వీకరణ



కాకతీయ, హనుమకొండ: హనుమకొండ జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారిగా (డీపీఆర్వో) బండి పల్లవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్‌లోని డీపీఆర్వో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. నూతన డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన బండి పల్లవికి జిల్లా అధికారులు, సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సమాచార వారధిగా పనిచేస్తూ శాఖకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## మండల స్థాయి ప్రజావాణికి విశేష స్పందన

**10 మండలాల్లో 180 దరఖాస్తుల స్వీకరణ**

**సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి**

**అదనపు కలెక్టర్ మహేందర్ జి**



కాకతీయ, ములుగు ప్రతినిధి: జిల్లా ప్రజలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలో నిర్వహించిన ప్రజావాణికి విశేష స్పందన లభించిందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిహెచ్. మహేందర్ జి తెలిపారు. సోమవారం 10 మండలాల్లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 180 దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన 219 మంది అధికారులు హాజరయ్యారని తెలిపారు. ఏటూరునాగారంలో 24, గోవిందరావుపేటలో 14, కన్నాయిగూడెంలో 3, మల్లంపల్లిలో 32, మంగపేటలో 42, ములుగులో 14, ఎస్.ఎస్. తాడ్వాయిలో 10, వెంకటాపూర్‌లో 25, వెంకటాపురంలో 12, వాజేడులో 4 దరఖాస్తులు అందినట్లు వివరించారు. దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా చర్యల వివరాలను వారికి తెలియజేయాలని ఆదేశించారు. ప్రజలు మండల స్థాయి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మొండి వైఖరి వీడండి.. రైతులకు నీళ్లివ్వండి



- ఎస్సారెస్పీ నీళ్లు విడుదల చేసే వరకు శ్రమించేది లేదు
- రైతాంగాన్ని ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం
- ఎండిపోతున్న పంటలను చూసి ఊరుకోం
- పోరాటం ఉధృతం చేస్తాం
- :మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



కాకతీయ, రాయపర్తి : ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరిని వీడి ఎండిపోతున్న పంట పొలాలకు సాగునీటిని తక్షణమే విడుదల చేయాలని బీఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ సోమవారం మైలారం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ నుంచి మడూర్ కెనాల్ వరకు కాలువ వెంట ఆయన భారీ పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో పెద్ద సంఖ్యలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని గులాబీ జెండాలు చేతబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతం గులాబీమయంగా మారింది. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని అన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. పంటలు చేతికొచ్చే సమయంలో నీరు అందక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించకుండా, విద్యుత్ కోతలతో మరింత ఇబ్బందులకు గురిచేస్తూ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఎస్సారెస్పీ నుంచి సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.

### నీళ్లు విడుదల చేసే వరకు పోరాటం

ఎండిపోతున్న పంటలను చూస్తూ తాము ఊరుకునేది లేదని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగునీటిని విడుదల చేయాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నీటిని విడుదల చేయకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని ఆపేది లేదని రైతులు కూడా స్పష్టం చేశారు. పాదయాత్రలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మూనావత్ నరసింహా నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్, పార్టీ కార్యకర్తలు, రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ అధ్యక్షుడిగా యాకన్న



కాకతీయ, ఇనుగుర్తి: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన లక్ష్మీ నరసింహ స్వామి ఆటో యూనిట్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడు ఆవుల యాకన్న, ఉపాధ్యక్షుడు బానోత్ రాజు, ప్రధాన కార్యదర్శి బూర రాజేష్, కోశాధికారి బానోత్ రాజీవ్ లను కమిటీ ప్రకటించింది. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ ఆటో యూనియన్ అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో పసునూరి వెంకన్న, తమ్మడపల్లి వెంకటసాయిలు, లింగాల శ్రీనివాస్, చెట్టబోయిన వినోద్, గుండ్రపెల్లి వీరన్న, బోయిని వెంకన్న, దేవులపల్లి చిన్న వెంకన్న, మాలోత్ భద్రు, పప్పుల యాకన్న, గోపందాస్ కృష్ణ, బండి రాజు, చిట్టిపోతుల ప్రవీణ్, ఎం.డీ యాకూబ్ పాషా, సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లికుదురు లో ప్రజావాణి ప్రారంభం

### ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

### డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ నితీష్




కాకతీయ,నెల్లికుదురు: గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కార దిశగా ఏర్పాటుచేసిన ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ నితీష్ అన్నారు. స్థానిక ప్రజా సమస్యలు ఆయా మండలాల పరిధిలోనే పరిష్కారం చూపడానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం మండల కేంద్రం నెల్లికుదురు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సింగారపు కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. దీనికి డిప్యూటీ ట్రైని కలెక్టర్ నితీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నితీష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఎక్కడికి ఎక్కడ పరిష్కరించుకోవడానికి ప్రజావాణి చక్కని వేదిక అన్నారు. ప్రజావాణి ఫిర్యాదుల కోసం జిల్లా కేంద్రాలకు తరలి వెళ్లడం సమయంతో పాటు ఆర్థిక వ్యయం అలసట తో కూడిన ప్రయాస అన్నారు. ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజలకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభించిన ప్రజావాణికి 18 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో సింగారపు కుమార్ తెలిపారు. సంబంధిత దరఖాస్తులలో 7 రెవెన్యూ కు చెందినవి,హౌసింగ్ కు సంబంధించినవి 4, విద్య 1, ఎంపీడీవో 2, విద్యుత్ 1, ఏఈ పంచాయితీ రాజ్ విద్యకు సంబంధించిన అప్లికేషన్ ఒకటి1, ఎంపీడీవో కు సంబంధించినవి 2, విద్యుత్ 1, ఐబి &సి ఏ బి 2చెందినవి దరఖాస్తులు ప్రజావాణి కి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ చంద నరేష్, ఎంపీ ఓ అజీమితుల్ల, ఏవో భూక్య మహేందర్, ఎంఈవో రామదాస్, ఫిషరీస్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీపతి,పశువైద్యాధికారి శ్రీనివాస్, ఏఈ అనిల్ కుమార్ తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జంగం రవి యాదవ్



కాకతీయ, జనగామ: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జంగం రవి యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవి యాదవ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, సర్పంచ్ ఎడవెల్లి లావణ్య మల్లారెడ్డి, ఉపసర్పంచ్ పశుల వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని గ్రామంలో మరింత బలోపేతం చేస్తానన్నారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని, వారి సమస్యలను ఉన్నత నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- మండల పరిషత్ కార్యాలయంలో 8 అర్జీల స్వీకరణ
- వివిధ శాఖలకు చెందిన 16 మంది అధికారులు హాజరు
- సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశం




కాకతీయ, గీసుగొండ : ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, వారికి వేగవంతమైన సేవలు అందించడమే ప్రజావాణి కార్యక్రమం లక్ష్యమని ఎంపీడీఓ వి. కృష్ణవేణి, తహసీల్దార్ ఎం.డి. రియాజుద్దీన్ తెలిపారు.

సోమవారం గీసుగొండ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 8 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ కృష్ణవేణి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో నిర్వహించిన ప్రజావాణిలో తొలి వారంలో తొలి దరఖాస్తును మరియపురం గ్రామానికి చెందిన రంపీస మదన్ మోహన్ అందించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ నూతన్ ప్రసాద్, వెటర్నరీ డాక్టర్ జి. శ్రీనివాస్, ఏఈ రాజు, సందీప్, మండల విద్యాశాఖ అధికారి రవీందర్, సూపరింటెండెంట్ కమలాకర్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన 16 మంది అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈ–పంచాయతీ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌ను కొనసాగించాలి



### ఆడబిడ్డలకు తులం బంగారం అందించాలి

### పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలి

### బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన.. ఆర్డీవోకు వినతిపత్రం

కాకతీయ, నర్సంపేట టౌన్ : కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించి పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా కల్పించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆడబిడ్డలకు తులం బంగారం అందించాలని కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సోమవారం నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచాయని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు ఇతర పేద కుటుంబాలకు ఈ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు 13 లక్షల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు.

### పెండింగ్ లబ్ధిదారులకు సాయం అందించాలి

ప్రస్తుతం ఈ పథకాల అమలుపై నెలకొన్న అనిశ్చితిని ప్రభుత్వం వెంటనే తొలగించాలని నాయకులు డిమాండ్ చేశారు. కోర్టు పరిణామాలను సాకుగా చూపకుండా పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం అందించే అంశాన్ని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసాగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను పార్టీలకు అతీతంగా కొనసాగించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు నర్సంపేట ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయిడి రవీందర్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, తక్కలపల్లి రవీందర్‌రావు, నామాల సత్యనారాయణ, నాడెం శాంతికుమార్, గోనె యువరాజు, వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, నాగిశెట్టి ప్రసాద్, మండల శ్రీనివాస్, రాయుడు దుశాంత్‌రెడ్డి, బూస రాజు, దొమ్మటి సంతోష్, నవీన్‌నాయక్, పెండెం వెంకటేశ్వర్లు, కదారి కుమార్, కందికొండ శ్రీనివాస్, బీరం నాగిరెడ్డి, బండి ప్రవీణ్, చింతల టార్జాన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తిప్పికొడతాం



- పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా కల్పించాలి
- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేస్తే ఊరుకోం
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లబెల్లి మండలంలో నిరసన

కాకతీయ, నల్లబెల్లి : కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొడతామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం నల్లబెల్లి మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు నిరసన ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బానోతు సారంగపాణి మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహాలు కుటుంబాలకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాల ద్వారా ఇప్పటివరకు లక్షలాది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల అమలులో జాప్యం చేస్తోందని విమర్శించారు. లబ్ధిదారులకు జారీ చేసిన చెక్కులు నగదుగా మారడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను నిర్వీర్యం చేయడం సరికాదన్నారు.

### అర్హులకు సకాలంలో సాయం అందించాలి

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి సకాలంలో ఆర్థిక సాయం అందించాలని సారంగపాణి డిమాండ్ చేశారు. పథకాల అమలులో జాప్యాన్ని నివారించి పేద కుటుంబాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కక్కర్ల శ్రీనివాస్ గౌడ్, చెట్టుపల్లి మురళీధర్, ఉడుగుల ప్రవీణ్‌కుమార్ గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా,వివిధ గ్రామాల సర్పంచులు,మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## శాలరీ ప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలి

- ఉద్యోగులకు ఎస్బీఐ శాలరీ ప్యాకేజీపై అవగాహన
- బీమా, పెన్షన్, రుణ రాయితీలను వినియోగించుకోవాలి
- ఆర్థిక భద్రతకు శాలరీ ప్యాకేజీ దోహదం
- అదనపు కమిషనర్ ఆధ్వర్యంలో మరింత అవగాహన
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న శాలరీ ప్యాకేజీ ప్రయోజనాలను ఉద్యోగులు పూర్తిగా అర్థం చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న సూచించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఎస్బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో ఎస్బీఐ చీఫ్ మేనేజర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ ప్రతినిధి అనిరుధ్ జనక్ నేతృత్వంలోని బ్యాంకు అధికారులు శాలరీ ప్యాకేజీ ప్రయోజనాలను దృశ్య మాధ్యమం ద్వారా వివరించారు. జీరో బ్యాలెన్స్ శాలరీ ఖాతా, ఆరోగ్య బీమా, పెన్షన్ ప్రయోజనాలు, రుణాలపై రాయితీలు, ఇతర బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ ఉద్యోగుల ఆర్థిక భద్రత, సంక్షేమానికి శాలరీ ప్యాకేజీ దోహదపడుతుందని అన్నారు. ముఖ్యంగా ప్రమాదాలు, అనుకోని పరిస్థితుల్లో బీమా ప్రయోజనాలు ఉద్యోగులకు, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని తెలిపారు. ఉద్యోగులందరికీ ప్యాకేజీపై మరింత అవగాహన కల్పించేందుకు అదనపు కమిషనర్ ఆధ్వర్యంలో చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఇన్‌చార్జి సీహెచ్‌వో లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, పన్నుల అధికారి రామకృష్ణ, ఎస్బీఐ జీడబ్ల్యూఎంసీ బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్, బ్యాంకు అధికారులు, బల్దియా ఉద్యోగులు పాల్గొన్నారు.

## రైస్‌మిల్ పరిశ్రమను కాపాడాలి

### మిల్లింగ్ చార్జీలు పెంచాలి.. విద్యుత్ టారిఫ్ సవరించాలి

### జిల్లాకు అవసరమైన గోదాములు నిర్మించాలి

### సీఎం రేవంత్ రెడ్డికి బాదం ప్రవీణ్ వినతి



కాకతీయ, ములుగు ప్రతినిధి : తెలంగాణలో రైస్‌మిల్ పరిశ్రమను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కోరారు. ఆదివారం ములుగు జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి అసోసియేషన్ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ధాన్యం సేకరణ నుంచి బియ్యం డెలివరీ వరకు మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ధాన్యం మిల్లుల్లో 60 రోజులకు పైగా నిల్వ ఉండటంతో వెయిట్ లాస్, డ్యామేజ్, రంగు మారడం వల్ల క్వింటాకు రూ.600 నుంచి రూ.750 వరకు నష్టం వస్తోందన్నారు. స్టార్చ్ మిషన్ల వినియోగంతో అదనంగా 60 హెచ్‌పీ విద్యుత్ అవసరమవుతోందని తెలిపారు. మిల్లింగ్ చార్జీలను పెంచాలని, 124 నుంచి 199 హెచ్‌పీ వరకు ఎల్‌టీ కేటగిరీలో కొనసాగించేలా విద్యుత్ టారిఫ్‌ను సవరించాలని కోరారు. పాత గన్నీ సంచుల భారం తగ్గించాలని, ప్రతి జిల్లాకు అవసరమైన సామర్థ్యంతో గోదాములు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యంతో ఉత్పత్తయ్యే బియ్యాన్ని థర్డ్ పార్టీలకు విక్రయించే అవకాశం కల్పించేలా నిబంధనలు మార్చాలని కోరారు. రైస్‌మిల్ పరిశ్రమను కాపాడేందుకు సీఎం ప్రత్యేక చొరవ తీసుకోవాలని బాదం ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు.

# అక్రమ వేటగాళ్లను కఠినంగా శిక్షించాలి

## నవీన్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

కాకతీయ, కారేపల్లి : వన్యప్రాణులను వేటాడేందుకు ఏర్పాటు చేస్తున్న అక్రమ విద్యుత్ ఉచ్చులు జంతువులతో పాటు అటవీ అధికారులు, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల గిద్దవారిగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బానోత్ దేవులా నాయక్ కుమారుడు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ నాయక్ విధి నిర్వహణలో అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, పీఏసీఎస్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హనుమంతరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబ్రు నాయక్, అడ్డగోడ ఐలయ్య, ముత్యాల సత్యనారాయణ, ఉన్నం వీరేందర్, రావూరి శ్రీనివాస్, ఏపూరి మల్లికార్జున్, దేగల ఉపేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా మార్చాలి

- హైస్కూల్, జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడ నిర్మించాలి
- విద్య, వైద్యం, మౌలిక వసతులు మెరుగుపరచాలి
- ప్రజావాణిలో సీపీఐ(ఎం) వినతి




కాకతీయ, కారేపల్లి : ఏజెన్సీ మండలమైన కారేపల్లిలో ప్రజలకు మెరుగైన విద్య, వైద్యంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సీపీఐ(ఎం) సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రభుత్వ ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వర రావు, మండల కార్యదర్శి కె. నరేంద్ర మాట్లాడుతూ.. కారేపల్లి మండలంలో 41 పంచాయతీలు, 86 శివారు గ్రామాలు, సుమారు 70 వేల జనాభా ఉందన్నారు. ఇంత పెద్ద జనాభా ఉన్న మండలంలో ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, రవాణా, ఇతర మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసి 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని డిమాండ్ చేశారు. తద్వారా మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మండలంలోని మరో ప్రాంతంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న మహిళా వైద్యురాలు, ఫార్మసిస్ట్, సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంత ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితిని నివారించాలని కోరారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలలకు ప్రహరీ గోడ నిర్మించాలని సీపీఐ(ఎం) నాయకులు కోరారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన వంట షెడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎస్సీ, బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మాణిక్యారం నుంచి మొట్లగూడెం వరకు మెటల్ వేసి అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి ప్రజల రవాణా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు వజ్జా మారావు, కొండబోయిన ఉమావతి, యనమనగండ్ల రవి, ముండ్ల ఏకాంబరం, కేసగాని ఉపేందర్, రేగళ్ల మంగయ్య, గంగా ధరణి, ఉపేందర్, భాగ వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# తులం బంగారం హామీని అమలు చేయాలి

- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై ప్రభుత్వ తీరు ఆందోళనకరం
- పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి
- బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



కాకతీయ, ఖమ్మం టౌన్ : కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పేద కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తోందని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు అన్నారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాలు వేలాది కుటుంబాలకు అండగా నిలిచాయని గుర్తుచేశారు. హైకోర్టులో ఈ పథకాలపై విచారణ జరుగుతున్న సమయంలో ప్రభుత్వం తగిన విధంగా స్పందించి, అర్హులైన కుటుంబాలకు పథకాల ప్రయోజనాలు అందేలా న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని నామ పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పేద కుటుంబాలు నష్టపోయే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై నెలకొన్న అనిశ్చితికి ప్రభుత్వం వెంటనే తెరదించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు.

### తులం బంగారం హామీ ఏమైంది?

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కళ్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని నామ గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ అమలుపై స్పష్టత లేకుండా పోయిందని విమర్శించారు. పేదల ఆడబిడ్డల వివాహాల విషయంలో రాజకీయాలకు అతీతంగా మానవతా దృక్పథంతో ప్రభుత్వం వ్యవహరించాలని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నందున వాటిని యథావిధిగా కొనసాగించాలని నామ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పథకాల అమలుపై స్పష్టమైన ప్రకటన చేసి పేద కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు.

# వాహ్.. కమిషనర్ జీ!

## చిన్నారి వైద్యానికి అండగా అభిషేక్ అగస్త్య





- రూ.14 లక్షల సాయం అందేలా చొరవ
- శస్త్రచికిత్స విజయవంతం.. కోలుకున్న చిన్నారి
- కమిషనర్ పేరుతో 'జస్విక శ్రీ'గా నామకరణం
- కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు

కాకతీయ, ఖమ్మం బ్యూరో : ఆపదలో ఉన్న ఓ చిన్నారి కుటుంబానికి అండగా నిలిచారు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న పసికందుకు చికిత్స చేయించేందుకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబానికి ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థల సహకారం అందేలా చొరవ తీసుకున్నారు. ఆయన కృషితో చిన్నారి గుండె శస్త్రచికిత్సకు అవసరమైన రూ.14 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. చికిత్స విజయవంతం కావడంతో ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా కోలుకుంది. ఖమ్మం నగరానికి చెందిన కాంపాటి రాకేష్, మాధవి దంపతులకు 2026 మే 9న ఆడబిడ్డ జన్మించింది. పుట్టిన 12 రోజులకే చిన్నారి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. వైద్యులు శస్త్రచికిత్స అవసరమని సూచించడంతో.. అందుకు అయ్యే ఖర్చు భారీగా ఉండటంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఖమ్మం నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న చిన్నారి నానమ్మ నరసమ్మ ఈ విషయాన్ని కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి చిన్నారి వైద్యానికి అవసరమైన సహాయం అందించే ప్రయత్నాలు ప్రారంభించారు.

### రూ.14 లక్షల సాయం.. విజయవంతంగా ఆపరేషన్

హృదయ స్వచ్ఛంద సంస్థతోపాటు ప్రభుత్వ సహకారంతో చిన్నారి గుండె శస్త్రచికిత్సకు అవసరమైన రూ.14 లక్షల ఆర్థిక సాయం మంజూరయ్యేలా కమిషనర్ చొరవ తీసుకున్నారు. దీంతో జూలై 28న చిన్నారికి గుండె శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా కోలుకోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆనందం నెలకొంది. చికిత్స అనంతరం చిన్నారిని తీసుకుని తల్లిదండ్రులు మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి వచ్చారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో కమిషనర్‌ను కలిసి తమ కుటుంబానికి చేసిన సాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

### 'జస్విక శ్రీ'గా నామకరణం

తమ కుమార్తెకు కమిషనర్ పేరే పెట్టాలని కుటుంబ సభ్యులు కోరారు. దీంతో అభిషేక్ అగస్త్య సంతోషం వ్యక్తం చేస్తూ చిన్నారికి 'జస్విక శ్రీ' అని నామకరణం చేశారు. చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో, సంతోషంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న తమ కుటుంబానికి సకాలంలో స్పందించి చిన్నారి ప్రాణాలు నిలిచేలా వైద్య సాయం అందేందుకు కృషి చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్యకు రాకేష్, మాధవి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

# ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- ఖమ్మం జిల్లాలో 10,85,927 మంది ఓటర్లు
- 1,76,135 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల నోటీసులు
- అర్హులైన కొత్త ఓటర్లు ఫారమ్-6తో నమోదు చేసుకోవచ్చు
- ఖమ్మం కలెక్టర్ దివాకర టీఎస్



కాకతీయ, ఖమ్మం : ముసాయిదా ఓటర్ల జాబితాపై క్లెయి మ్‌లు, అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 16లోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం సోమవారం ఖమ్మం జిల్లాకు సంబంధించిన ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ప్రక్రియ వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా జాబితా విడుదలైందని కలెక్టర్ తెలిపారు. ఇందులో 5,24,894 మంది పురుషులు, 5,60,973 మంది మహిళలు, 60 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని చెప్పారు. ముసాయిదాలో 1,33,004 మంది ఓటర్లకు అనామలీస్, 43,131 మందికి మ్యాపింగ్ లేదని గుర్తించినట్లు తెలిపారు. మొత్తం 1,76,135 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

### పత్రాలు సమర్పించాలి

నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టిన తేదీ ఆధారంగా ఎన్నికల సంఘం సూచించిన సంబంధిత పత్రాలను సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ముసాయిదా జాబితాలో పేరు లేకపోతే బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా ఎన్నికల నమోదు అధికారిని సంప్రదించాలని తెలిపారు. అర్హులైన కొత్త ఓటర్లు ఫారమ్–6 ద్వారా సెప్టెంబర్ 16లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. చనిపోయిన లేదా డూప్లికేట్ ఓటర్లపై ఫారమ్–7, చిరునామా మార్పు, మొబైల్ నంబర్ నవీకరణ, వివరాల సవరణకు ఫారమ్–8 వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తామని, వాటి పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని చెప్పారు. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని కలెక్టర్ తెలిపారు. ఓటర్లు తమ వివరాలను సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని, సందేహాలుంటే టోల్‌ఫ్రీ 1950కు సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్ విద్యార్థులకు ఇస్తున్న దానం కాదు




- పెండింగ్ రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి
- కోర్టు ఆదేశాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం బేఖాతరు చేస్తోంది
- మంత్రుల క్యాంపు కార్యాలయాల ముట్టడి
- పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్లను విడుదల చేయాలి
- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ

కాకతీయ, ఖమ్మం : స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న దానం కాదని, వారి హక్కు అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ అన్నారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఉమ్మడి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయాలను విద్యార్థులు ముట్టడించారు. విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ తమకు ఇవ్వాలని నినాదాలు చేశారు. నిరసనను పోలీసులు అడ్డుకుని పీడీఎస్‌యూ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో క్యాంపు కార్యాలయాల వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. కాంపాటి పృథ్వీతో పాటు పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు టి. లక్ష్మణ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మునిగల శివ ప్రశాంత్ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

### చదువులకు ఆటంకంగా జాప్యం

కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా రీయింబర్స్‌మెంట్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో పరీక్ష ఫీజులు, పుస్తకాలు, ప్రయాణం, హాస్టల్, ల్యాబ్ ఖర్చులు భరించలేక ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొందరు చదువులు మధ్యలోనే ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని ఆదేశించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పృథ్వీ ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్లను తక్షణమే విద్యార్థులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీడీఎ స్‌యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బుర్ర వీరభద్రం, నాయకులు సురేష్, హరిచంద్ర ప్రసాద్, రఘు, రామ్‌చరణ్, మనోజ్, సుశాంత్, గోపి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మునగాలకు వందే భారత్

# జాతీయ సమైక్యత అవార్డు

- మూడు దశాబ్దాలుగా జానపద కళ ద్వారా సామాజిక చైతన్యం
- పల్లెపల్లెకూ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన




కాకతీయ, ఖమ్మం టౌన్: ప్రముఖ జానపద కళాకారుడు, తెలంగాణ సాంస్కృతిక సారథి మునగాల వెంకటరత్నం వందే భారత్ జాతీ య సమైక్యత అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలోని పైడి జయరాజు ప్రీవ్యూ థియేటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం స్వీకరించారు. ఖమ్మం జిల్లాలో సుమారు 30 ఏళ్లుగా సమాచార పౌర సంబంధాల శాఖతో కలిసి జానపద కళ ద్వారా సంక్షేమ పథకాలు, సారా నిషేధం, పర్యావరణ పరిరక్షణ, ఎయిడ్స్ నివారణ, కుటుంబ నియంత్రణ, అక్షరాస్యత, అంటరానితనం, బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గతంలో పలువురు సీఎంలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ల నుంచి అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. డీఐపీఆర్వో మహమ్మద్ గౌస్, వందనం సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు, పొన్నం చిన్నశంకర్, శ్రీనివాసరావు, సీనియర్ కళాకారులు కన్నెబోయిన అంజయ్య, మిమిక్రీ సుధాకర్, పమ్మి రవి, పాగి వెంకన్న, బీరెల్లి రమణ, నందు గురవయ్య, జాను మొగిలి, వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, డాక్టర్ వంశీ రామరాజు, జెన్ని, పోలా ప్రగడ జనార్దన్‌రావు, చొక్కపు వెంకటరమణ, మల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 19న జాబ్ మేళా..

# 95 ప్రైవేట్ ఉద్యోగాల భర్తీకి అవకాశం

- ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ అర్హతతో దరఖాస్తు
- నిరుద్యోగ యువత హాజరుకావాలి
- జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఎన్. మాధవి




కాకతీయ, ఖమ్మం టౌన్ : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 19న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఎన్. మాధవి తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం హవేలీ రెస్టారెంట్‌కు ఎదురుగా ఉన్న టీటీడీసీలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ), ఇండస్‌ఇండ్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఖమ్మం కీర్తన గోల్డ్ లోన్స్ సంస్థల్లో మొత్తం 95 ఉద్యోగాల భర్తీకి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మాధవి తెలిపారు. ఎల్ఐసీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ అడ్వైజర్ పోస్టులు 50 ఖాళీలు ఉన్నాయని, ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదేని డిగ్రీ అర్హతతో 18 నుంచి 40 ఏళ్ల వయస్సు వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇండస్‌ఇండ్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులు 20 ఉన్నాయని, ఏదేని డిగ్రీ అర్హత కలిగిన 18 నుంచి 30 ఏళ్ల వయస్సు మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఖమ్మం కీర్తన గోల్డ్ లోన్స్ కంపెనీలో లోన్ ఆఫీసర్, రిలేషన్‌షిప్ ఆఫీసర్ పోస్టులు 25 ఖాళీలు ఉన్నాయని, ఏదేని డిగ్రీ అర్హతతో 18 నుంచి 30 ఏళ్ల వయస్సు వారు హాజరుకావచ్చని తెలిపారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాన్ని బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం ఉంటుందని మాధవి తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం హెచ్ ఆర్ సెల్ నంబర్లు 8143420505, 9618890879, 8106790700లో సంప్రదించాలని జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఎన్. మాధవి తెలిపారు.

# కళ్యాణలక్ష్మిపై 'కుట్ర'!

## తులం బంగారంతో రూ.లక్ష ఇవ్వాల్సిందే.. బీఆర్ఎస్ భగ్గు



### హైకోర్టు కేసుపై ప్రభుత్వం వైఖరి వెల్లడించాలి
### మహిళలకు ఇచ్చిన హామీని అమలు చేయాలి
### వేములవాడలో భారీ ర్యాలీ.. తహసీల్దార్‌కు వినతిపత్రం



కాకతీయ, వేములవాడ : పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసాగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆంక్షలు లేకుండా యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వేములవాడలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన చేపట్టాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చెల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదేశాలతో పట్టణంలోని తెలంగాణ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి–రాజు, సీనియర్ నాయకుడు నిమ్మశెట్టి విజయ్ మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఈ పథకాలు ఎంతో అండగా నిలిచాయని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొలుత ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రూ.51 వేలతో పథకాన్ని ప్రారంభించి, దశలవారీగా రూ.75 వేలకు పెంచిందన్నారు. అనంతరం అన్ని వర్గాల అర్హులైన లబ్ధిదారులకు రూ.1,00,116 వరకు ఆర్థిక సాయం అందించిందని తెలిపారు.

#### తులం బంగారం హామీ ఏమైంది?

2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే డిసెంబర్ 9న రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి మహిళల ఓట్లు పొందిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా మహిళలను మోసం చేసిందని విమర్శించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కళ్యాణలక్ష్మి కింద రూ.లక్షతో పాటు తులం బంగారం అందించాలని డిమాండ్ చేశారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయరాదన్నారు. పేదల సంక్షేమానికి గత ప్రభుత్వం అమలు చేసిన అంగన్‌వాడీ న్యూట్రిషన్ కిట్, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని నాయకులు ఆరోపించారు. పేదలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలను తొలగించే వైఖరిని ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. ఉచిత పథకాలపై హైకోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి సంబంధించి ప్రభుత్వం తరఫున సరైన వాదనలు వినిపించడంలో నిర్లక్ష్యం ఎందుకు జరిగిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన ఈ అంశంపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.

#### నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం ఉధృతం

బీఆర్ఎస్ మహిళా కౌన్సిలర్లు ఏనుగు జ్యోతి, వెంగళ అనిత మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనసాగించాలని కోరారు. అర్హులైన లబ్ధిదారులందరికీ రూ.లక్షతో పాటు తులం బంగారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ర్యాలీ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వాసాల లావణ్య–శ్రీనివాస్, ఏనుగు తిరుపతిరెడ్డి, వెంగళ శ్రీకాంత్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు గూడూరి మధు, సిరిగిరి రాంచందర్, మారం కుమార్, కొండ నర్సయ్య, రేగుల రాజేశం, పెద్ది రాజు, గోస్కుల నర్సయ్య, ఉల్లెందుల హన్మంత్, మహిళా నాయకురాళ్లు మొట్టల అనూష, జంగిటి శ్రీనిధి, పెద్ది లలిత, మంతె సందీప్, సుంకపాక రాజు, వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి, నిమ్మశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

# బందిపోటు ముఠాపై పీడీ యాక్ట్

- పీఎంజే జ్యువెలర్స్ దోపిడీ కేసులో కీలక చర్య
- సిబ్బందిపై కాల్పులు జరిపి రూ.82 లక్షల బంగారం దోపిడీ
- ప్రధాన నిందితులైన ఐదుగురిపై నిర్బంధ ఉత్తర్వులు
- ఇప్పటి వరకు ఎనిమిది మంది అరెస్టు
- చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలింపు
- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



కాకతీయ, కరీంనగర్ : నేర కార్యకలాపాలను అరికట్టడం, ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు నేరస్థుల్లో భయాన్ని కలిగించేందుకు పీ.యం.జే. జ్యువెలర్స్ బందిపోటు కేసులో ప్రధాన నిందితులైన ఐదుగురిపై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. 2026 మే 3న కరీంనగర్ పట్టణంలోని పీ.యం.జే. జ్యువెలర్స్ దుకాణంలోకి చొరబడిన దుండగులు సిబ్బందిపై కాల్పులు జరిపి రూ.82 లక్షల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారిలో ప్రధాన నిందితులుగా గుర్తించిన ఐదుగురిపై ఆదివారం పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. పీడీ యాక్ట్ కింద నిర్బంధించిన వారిలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జాగీరా సింగ్, బీహార్‌లోని నలందకు చెందిన రావిష్ కుమార్ అలియాస్ ప్రద్యుమాన్, సూర్యమణి కుమార్ అలియాస్ సనోజ్, పాట్నాలోని ఫుల్వారీ షరీఫ్‌కు చెందిన యాదవ్ అలియాస్ జైనుల్ అబ్దిన్, మహమ్మద్ ఆదిల్ ఖాన్ ఉన్నారు. నేర కార్యకలాపాలను నియంత్రించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడకుండా నిరోధించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

#### జిల్లా జైలు నుంచి చర్లపల్లికి

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వులను కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న నిందితులకు అందజేశారు. వారిని చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. కేసులో ప్రధాన నిందితులపై పీడీ యాక్ట్ అమలు చేయడంతో పోలీసు శాఖ కఠిన వైఖరిని స్పష్టం చేసింది. పీడీ యాక్ట్ అమలులో కీలక పాత్ర పోషించిన కరీంనగర్ పట్టణ ఏసీపీ ఎన్. వెంకటస్వామి, రెండో పట్టణ సీఐ కె. సృజన్‌రెడ్డిని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందించారు. నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

# ముస్త్యాల రైతు వేదికలో ప్రజావాణి..

### ప్రజా సమస్యలపై 11 ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు



కాకతీయ,చేర్యాల: ముస్త్యాల రైతు వేదికలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 11 ఫిర్యాదులు స్వీకరించారు.ఇందులో ఇరిగేషన్ ఏఈకి సంబంధించిన సమస్యలపై 4 ఫిర్యాదులు, భూ సమస్యలపై 3, రైతు భరోసా కోసం 1, ఇందిరమ్మ ఇల్లు కోసం 1, ఉపాధి హామీ పథకం అమౌంట్ కోసం 1, తాడూరు జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్) పోస్టు కోసం 1 ఫిర్యాదు అందింది.ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, సమస్యలను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రాజన్న క్షేత్రంలో గోవధ దందానా?

- అధికారులకు విహెచ్‌పీ ఫిర్యాదు
- అనుమతుల్లేని బిర్యానీ సెంటర్లపై తనిఖీలు చేపట్టాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- ఎంపీడీవో బింగి కీర్తనకు వినతిపత్రం సమర్పించిన వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గడప కిషోర్‌రావు



కాకతీయ, వేములవాడ : వేములవాడ పట్టణంలోని గోవధ శాలలు, అక్రమ పశువధ కేంద్రాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బిర్యానీ సెంటర్లు, ఇతర మాంస విక్రయ కేంద్రాలపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గడప కిషోర్‌రావు కోరారు. ఈ మేరకు వేములవాడ అర్బన్ మండల ఎంపీడీవో బింగి కీర్తనకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి కోడె మొక్కులు చెల్లించే ప్రత్యేక సంప్రదాయం ఉందని కిషోర్‌రావు తెలిపారు. ఈ నేపథ్యంలో గోవులు, కోడెలను భక్తులు పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. ఇలాంటి ప్రాంతంలో పశువైద్యాధికారి ధ్రువపత్రాలు, సంబంధిత అనుమతులు లేకుండా పశువధ జరుగుతున్నట్లయితే అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించాలని కోరారు.

#### అనుమతుల్లేని కేంద్రాలపై నిఘా

పట్టణంలో అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కళ్యాణి బిర్యానీ సెంటర్లు, ఇతర మాంస విక్రయ కేంద్రాలను అధికారులు తనిఖీ చేయాలని కిషోర్‌రావు విజ్ఞప్తి చేశారు. పశువధకు సంబంధించిన అనుమతులు, పశువైద్య ధ్రువపత్రాలు, ఇతర నిబంధనలను పరిశీలించి ఉల్లంఘనలు గుర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.వేములవాడ రాజన్న ఆలయానికి దేశ, రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారని, పట్టణానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ అంశంపై తక్షణమే స్పందించాలని కిషోర్‌రావు కోరారు. భక్తులు, పట్టణ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ అనుమానాస్పద పశువధ, మాంస విక్రయ కేంద్రాలపై సమగ్రంగా విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# కస్తూరిబా బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



- ఆరోగ్యం మెరుగయ్యే వరకు మెరుగైన వైద్యం అందించాలి
- విద్యార్థినులకు నిరంతర పర్యవేక్షణ.. తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు
- ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది : కలెక్టర్ కె. హైమావతి

కాకతీయ, చేర్యాల : మద్దూరు మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్యంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. బాలికల ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడే వరకు నిరంతర పర్యవేక్షణతో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి వైద్యులను ఆదేశించారు. సోమవారం చేర్యాల పట్టణంలోని సామాజిక ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాలికలతో ఆప్యాయంగా మాట్లాడి ధైర్యం చెప్పారు. ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

#### ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడే వరకు పర్యవేక్షణ

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కస్తూరిబా విద్యాలయంలో జరిగిన ఘటన బాధాకరమన్నారు. విద్యార్థినుల ఆరోగ్యం పూర్తిగా కోలుకునే వరకు వైద్యులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన చికిత్స అందించడంతో పాటు వైద్యుల సూచనల మేరకు మందులు, పోషకాహారం అందించాలని ఆదేశించారు. ఇప్పటికే విద్యాలయాన్ని పరిశీలించి విద్యార్థినుల చదువు, ఆరోగ్యం, వసతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థినుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని, పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్య సేవలు కొనసాగుతాయని కలెక్టర్ కె. హైమావతి తెలిపారు.

# పోటీ పరీక్షల విద్యార్థిపై బీర్ బాటిల్‌తో దాడి

### ఇద్దరు నిందితుల అరెస్ట్.. కోర్టులో హాజరు
### సింక్‌లో నీరు పోకపోవడంపై వివాదం
### మద్యం మత్తులో బాటిళ్లతో దాడి.. విద్యార్థికి తీవ్ర గాయాలు

కాకతీయ, కరీంనగర్ టౌన్ : కరీంనగర్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థిపై బీర్, మద్యం సీసాలతో దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ సీఐ కె. రామ్‌చందర్‌రావు తెలిపారు. బూడిద నవీన్‌గౌడ్, కమ్మరి నవీన్ అలియాస్ కుమార్‌లను ఎస్సై జి. రాజన్న అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కన్నెపల్లికి చెందిన మాయ మహేష్ కరీంనగర్‌లోని కట్టరాంపూర్, రెడ్డికాలనీలో నివాసం ఉంటున్నాడు. 2025లో ఎంబీఏ పూర్తి చేసిన ఆయన ఎస్సై, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. అతనితో పాటు బూడిద నవీన్‌గౌడ్ గదిలో ఉంటున్నాడు. ఈ నెల 15న రాత్రి నవీన్‌గౌడ్ స్నేహితుడు కమ్మరి నవీన్ అలియాస్ కుమార్ వారి గదికి వచ్చి అక్కడే బస చేశాడు. ఈ నెల 16న సాయంత్రం ముగ్గురూ కలిసి మద్యం సేవించారు. అదే రోజు రాత్రి సుమారు 12 గంటల సమయంలో గదిలోని సింక్‌లో నీరు సరిగా పోవడం లేదని, దాన్ని రిపేర్ చేయాలని నవీన్‌గౌడ్ మహేష్‌ను కోరాడు. తనకు నిద్ర వస్తోందని, తర్వాత చూస్తానని మహేష్ చెప్పడంతో ఇద్దరి మధ్య వివాదం జరిగినట్లు సీఐ తెలిపారు.

#### బాటిళ్లతో విచక్షణారహితంగా దాడి

ఈ క్రమంలో బూడిద నవీన్‌గౌడ్, కమ్మరి నవీన్ అలియాస్ కుమార్ కలిసి మహేష్‌పై బీర్ బాటిల్, మద్యం సీసాలతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తల, కాళ్లు, శరీరంలోని ఇతర భాగాలపై బాటిళ్లతో కొట్టడంతో మహేష్ తలకు తీవ్ర గాయమై రక్తస్రావం జరిగినట్లు పేర్కొన్నారు. దాడి నుంచి తప్పించుకున్న మహేష్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న ఇంటి యజమాని తలుపు తట్టగా ఎవరూ స్పందించలేదు. దీంతో పక్కింటి తలుపు తట్టడంతో వారు బయటకు వచ్చి అతడి పరిస్థితిని గమనించారు. వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించి మహేష్‌ను ఆసుపత్రికి తరలించారు. పక్కింటికి చెందిన విష్ణు ఈ విషయాన్ని మహేష్ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేయడంతో వారు ఆసుపత్రికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఎలాంటి తగాదాలు, గొడవలు, నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడకుండా అప్రమత్తంగా ఉండాలని సీఐ కె. రామ్‌చందర్‌రావు సూచించారు. యువత మద్యం సేవించి గొడవలకు పాల్పడటం, చెడు స్నేహాలకు లోనవడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని, తమ భవిష్యత్తు, ఉద్యోగ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. క్రిమినల్ కేసుల్లో నిందితులుగా మారితే భవిష్యత్తులో పోలీసు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సీఐ పేర్కొన్నారు.

# ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

### ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహణ
### కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొనసాగించాలని వినతి



కాకతీయ, రుద్రంగి: ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రుద్రంగి తహసీల్దార్ పుష్పలత కోరారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, సమస్యలను దరఖాస్తుల రూపంలో అందించి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజావాణి కన్వీనర్, ఎంపీవో రాజేశ్వర్, ఎస్సై మోతీరాం నాయక్, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించి, పెండింగ్ లబ్ధిదారులకు నగదు వెంటనే చెల్లించాలని వార్డు సభ్యులు చెప్యాల గణేష్, ఉప్పులూటీ గణేష్ తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకాలు ఎంతో అండగా ఉన్నాయని, పేదింటి ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు భారం కాకుండా మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రవేశపెట్టిన పథకాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

# కళ్యాణలక్ష్మి పథకం రద్దుకు కాంగ్రెస్ కుట్ర

### బీఆర్ఎస్ చందుర్తి మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య



కాకతీయ,చందుర్తి : పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ చందుర్తి మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య ఆరోపించారు. కళ్యాణలక్ష్మి పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సాయం అందించారని తెలిపారు. కళ్యాణలక్ష్మిని కొనసాగించడంతో పాటు ఆడబిడ్డలకు అదనంగా తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. హైకోర్టు నాలుగుసార్లు గడువు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్యాక్స్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మరాటి మల్లిక్, మాజీ ఏఎంసీ చైర్మన్ డప్పుల అశోక్, సర్పంచులు మాందాల అబ్రహం, కపిల శంకర్, కొక్కుల నరేష్, నాయకులు అసిన్పర్తి సుధాకర్, ఎండీ సమీర్, పోతరాజు నగేష్, ఏకే రావు, దుమ్మ ఆనంద్, బత్తుల కమలాకర్, సంటి బాపురావు, మాదాసు ప్రసాద్, పోతరాజు తిరుపతి, మరాటి భూపతి, గుంటి గంగాధర్, రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ
సినిమా
మంగళవారం
18 ఆగస్టు 2026

# మైథాలజీ థ్రిల్లర్‌లో నిధి అగర్వాల్



కాకతీయ, సినిమా : హీరోయిన్ నిధి అగర్వాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న కొత్త చిత్రం సోమవారం గ్రాండ్‌గా లాంచ్ అయింది. వరాహ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై సునీత్ పడోల్కర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. మైథాలజీ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ సినిమాను హీరోయిన్ ఓరియెంటెడ్ కథాంశంతో తెరకెక్కిస్తున్నారు. సినిమా ప్రారంభోత్సవంలో పీ. అశోక్, పీ. రేణుక కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. హుర్మత్ సర్నా క్లాప్ ఇచ్చారు. నిధి అగర్వాల్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో నిధి కొత్త అవతార్‌లో ఆసక్తికరంగా కనిపించారు. హీరోయిన్ పాత్ర చుట్టూ సాగే ఈ చిత్రానికి దర్శకుడు పవర్‌ఫుల్ కథను సిద్ధం చేసినట్లు చిత్రబృందం తెలిపింది. 'తంత్ర' తర్వాత శ్రీనివాస్ గోపిశెట్టి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది.

## బోల్డ్ సీన్లపై నా భార్యకు తెలుసు..

### ఆమె నన్ను నమ్ముతుంది: యష్



కాకతీయ, సినిమా : 'టాక్సిక్' చిత్రంలోని బోల్డ్ సన్నివేశాలపై తన భార్య, నటి రాధికా పండిట్ స్పందన ఎలా ఉంటుందో తనకు తెలుసని రాకింగ్ స్టార్ యష్ తెలిపారు. ఆ సన్నివేశాలు చూసి ఆమె సంతోషంగా ఉండకపోవచ్చని, అయితే తనను నమ్ముతుందని చెప్పారు. కథకు అవసరమైన సన్నివేశాలే తప్ప.. బోల్డ్‌గా చూపించాలనే ఉద్దేశంతో వాటిని చిత్రీకరించలేదని స్పష్టం చేశారు. 'టాక్సిక్' ప్రచార చిత్రాలు, టీజర్, ట్రైలర్‌లోని అశ్లీలతపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో యష్ ఈ వ్యాఖ్యలు చేశారు. కథ డిమాండ్ చేయడంతోనే తాను కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి ఆ సన్నివేశాల్లో నటించానన్నారు. రాధికా పండిట్ కూడా నటి కావడంతో నటన, వ్యక్తిగత జీవితానికి మధ్య తేడాను అర్థం చేసుకుంటారని తెలిపారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఆగస్టు 26న విడుదల కానుంది. డ్రగ్స్ మాఫియా నేపథ్యంలో సాగే ఈ సినిమాలో యష్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కియారా అద్వానీ, నయనతార, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## 10 రోజుల్లో రూ.50 కోట్లకు పైగా..

# 'కొరియన్ కనకరాజు' జోరు



కాకతీయ, సినిమా : రెండేళ్ల విరామం తర్వాత హీరో వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు'తో ప్రేక్షకుల ముందుకొచ్చారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ హారర్ కామెడీ చిత్రం బాక్సాఫీస్ వద్ద గ్రాండ్ సక్సెస్ అందుకుంది. ఈ నెల 7న విడుదలైన ఈ సినిమా మంచి వసూళ్లతో దూసుకెళ్తోంది. రితిక నాయక్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. హారర్, కామెడీ అంశాలతో రూపొందిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. దీంతో థియేటర్లలో వసూళ్ల జోరు కొనసాగుతోంది. విడుదలైన 10 రోజుల్లోనే 'కొరియన్ కనకరాజు' రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం వెల్లడించింది. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఈ సినిమా మంచి విజయంగా నిలవడంతో అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. రానున్న రోజుల్లో సినిమా వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని చిత్రవర్గాలు భావిస్తున్నాయి.

## మల్యాలలో 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు



కాకతీయ, చందుర్తి: చందుర్తి మండలం మల్యాల గ్రామంలో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, విక్రయాలపై పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా సుమారు 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వలను గుర్తించినట్లు సమాచారం. మల్యాలకు చెందిన గొంతి ప్రశాంత్ ఇంట్లో బియ్యం బస్తాలను అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టి నిల్వలను గుర్తించినట్లు తెలుస్తోంది. కోరుట్లకు చెందిన బోజ సంపత్ పాత ఇనుప సామాన్ల విక్రయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. పీడీఎస్ బియ్యం వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## పేదఇంటి పథకాలను రద్దు చేసే

# కుట్ర మానుకోవాలి

### బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

కాకతీయ, నెల్లికుదురు: పేద బడుగు బలహీన వర్గాల ఆడబిడ్డల కోసం భిఆర్ఎస్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయాలనే కుట్ర మానుకోవాలని బి ఆర్ ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు ధర్నా నిర్వహించి నిరసన తెలిపి అనంతరం తహసిల్దార్ సిహెచ్ నరేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలను తీసివేస్తే పేద ప్రజల కుటుంబాలకు తీవ్ర నష్టం కలుగుతుందని హైకోర్టు సాకుతో పథకాలను రద్దు చేసే కుట్ర మానుకోవాలని తెలంగాణ ప్రజల ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆదుకునే విధంగా ఈ పథకాలను కొనసాగించాలన్నారు లేని పక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, వివిధ గ్రామాల భిఆర్ఎస్ పార్టీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



# 326 మంది సిట్టింగ్ ఎంపీలపై కేసులు



- 14 మంది ముఖ్యమంత్రులపైనా క్రిమినల్ కేసులు
- 4,192 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు నివేదిక
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై 89 కేసులు
- ఎంపీల్లో కేరళ అగ్రస్థానం
- సుప్రీంకోర్టుకు అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా నివేదిక

కాకతీయ, న్యూఢిల్లీ : దేశంలోని ప్రజా ప్రతినిధులపై నమోదైన క్రిమినల్ కేసుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా 326 మంది సిట్టింగ్ ఎంపీలు, 14 మంది ముఖ్యమంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు సుప్రీంకోర్టుకు అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సమర్పించిన తాజా స్థాయి నివేదిక వెల్లడించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసులను వేగంగా విచారించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యానికి సంబంధించి ఈ నివేదికను సమర్పించారు. ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై మొత్తం 4,192 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల పర్యవేక్షణలో కేసుల విచారణను వేగవంతం చేసేందుకు చర్యలు జరుగుతున్నప్పటికీ, 2018 నుంచి పెండింగ్ కేసుల సంఖ్యలో పెద్దగా మార్పు కనిపించలేదని అమికస్ క్యూరీ తెలిపారు.

**ఎంపీల్లో తీవ్రమైన కేసులు**

లోక్‌సభలోని ఎంపీల్లో 170 మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఈ కేసుల్లో ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడే అవకాశముంటుంది. రాజ్యసభలోని 75 మంది ఎంపీల్లో 40 మంది తీవ్రమైన ఆరోపణలతో కేసులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడించింది. వివిధ హైకోర్టుల నుంచి అందిన వివరాల ప్రకారం 2025లో 1,243 కేసుల విచారణ పూర్తికాగా, అదే ఏడాది మరో 1,050 కొత్త కేసులు నమోదయ్యాయి. దేశంలోని 28 మంది ముఖ్యమంత్రుల్లో 14 మందిపై తీవ్రమైన నేరాలతో సహా క్రిమినల్ కేసులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అత్యధికంగా 89 కేసులు ఉన్నట్లు పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి 29 కేసులు, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 19 కేసులతో ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

**ఎంపీల్లో కేరళ టాప్**

వివిధ రాష్ట్రాల్లో క్రిమినల్ కేసులు నమోదైన ఎంపీల సంఖ్యలో కేరళ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలోని 20 మంది ఎంపీల్లో 19 మందిపై క్రిమినల్ ఆరోపణలు ఉండగా, 11 మందిపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఒడిశాలోని 21 మంది ఎంపీల్లో 16 మంది, ఝార్ఖండ్‌కు చెందిన 10 మంది, తమిళనాడుకు చెందిన 26 మంది ఎంపీలు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, బిహార్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో సగానికి పైగా ఎంపీలపై కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. హర్యానా, చండీగఢ్‌లో క్రిమినల్ కేసులు ఉన్న ఎంపీల సంఖ్య తక్కువగా ఉందని నివేదిక తెలిపింది. పంజాబ్‌లో 2 మంది, అస్సాంలో 3 మంది, ఢిల్లీలో 3 మంది, రాజస్థాన్‌లో 4 మంది, గుజరాత్, మధ్యప్రదేశ్‌లో 5 మంది చొప్పున ఎంపీలపై కేసులు ఉన్నట్లు వెల్లడించింది. అలహాబాద్ హైకోర్టు తన నివేదిక సమర్పించకపోవడంతో తాజా విశ్లేషణలో ఉత్తరప్రదేశ్‌ను చేర్చలేదని అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా నివేదికలో పేర్కొన్నారు.

# 2014 నుంచి అన్ని పరీక్షలు రద్దు

- టీడీపీఎల్ నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు
- ఫలితాలు, ఎంపికల జాబితాలకూ చెల్లుబాటు లేదు
- అక్రమాలపై సమగ్ర దర్యాప్తు
- సిట్, సీఐడీ విచారణలో కీలక విషయాలు
- విద్యార్థుల ప్రయోజనాలకు కఠిన చట్టం
- ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్



రాంచీ : పరీక్షల అవకతవకలపై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. టీఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 2014 నుంచి నిర్వహించిన అన్ని పరీక్షలను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటించారు. పరీక్షల ఫలితాలు, ఎంపికైన అభ్యర్థుల జాబితాలు సహా సంస్థకు సంబంధించిన అన్ని ప్రక్రియలను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు కఠినమైన చట్టాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన చిన్న, పెద్ద పొరపాట్లన్నింటిపైనా సమగ్ర విచారణ చేపడతామని స్పష్టం చేశారు. టీడీపీఎల్ సంస్థ 2014 నుంచి నిర్వహించిన పరీక్షలన్నింటినీ రద్దు చేయడంతో పాటు వాటి ఫలితాలు, ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాలను కూడా రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు హేమంత్ సోరెన్ తెలిపారు. సంస్థకు సంబంధించిన ప్రతి అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై విద్యార్థులు చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు వెల్లడించారు.

**సిట్, సీఐడీ దర్యాప్తులో విస్తుపోయే అంశాలు**

సిట్, సీఐడీ చేపట్టిన దర్యాప్తులో అనేక దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతున్నందున ప్రతి అంశాన్ని బహిరంగంగా వెల్లడించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు సంబంధిత వివరాలను వెల్లడించలేమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టానికి చేసిన సవరణలపై చర్చించేందుకు త్వరలో సమావేశం నిర్వహిస్తామని హేమంత్ సోరెన్ తెలిపారు. అవసరమైతే ఈ అంశంపై చర్చించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను కూడా నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచడంతో పాటు విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేలా కఠినమైన చట్టాన్ని తీసుకొస్తామని ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ స్పష్టం చేశారు.

# భట్టి నెట్‌వర్క్ భరతం పట్టాం

- 14 రాష్ట్రాల్లో సమన్వయ ఆపరేషన్లు
- 253 మంది ఆపరేటివ్‌ల అరెస్టు
- ఐఈడీలు, గ్రెనేడ్లు, పిస్టల్స్ స్వాధీనం
- 80కి పైగా కేసుల నమోదు
- సరిహద్దు అవతలి కుట్రలను ఛేదిస్తున్న దర్యాప్తు
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ : ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే 14 రాష్ట్రాల్లో సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్లలో పాకిస్థాన్ కేంద్రంగా, ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్న షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను భగ్నం చేసినట్లు వెల్లడించారు. ఈ నెట్‌వర్క్‌కు చెందిన 253 మంది ఆపరేటివ్‌లను అదుపులోకి తీసుకుని, విధ్వంసక దాడుల ప్రణాళికలను అడ్డుకున్నామని తెలిపారు. ఎక్స్ వేదికగా అమిత్ షా ఈ వివరాలను వెల్లడించారు. నెట్‌వర్క్ నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టల్స్, తూటాలు, గూఢచర్యానికి వినియోగించే సీసీటీవీ కెమెరాలతో పాటు భారీగా సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దేశ భద్రతా సంస్థలు వివిధ రాష్ట్రాల్లో ఏకకాలంలో నిర్వహించిన ఆపరేషన్లతో నెట్‌వర్క్‌ను చిన్నాభిన్నం చేశాయని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం భట్టి నెట్‌వర్క్‌కు గ్రెనేడ్, ఐఈడీ, పెట్రోల్ బాంబు దాడులు, లక్షిత హత్యలతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు, భద్రతా సంస్థలు, మతపరమైన ప్రదేశాల్లో రెక్కీ నిర్వహించేందుకు, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి స్థానిక మధ్యవర్తులకు ఈ నెట్‌వర్క్ డబ్బులు అందించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 62, హరియాణాలో 52, దిల్లీలో 51, పంజాబ్‌లో 44, రాజస్థాన్‌లో 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలో 8, ఉత్తరాఖండ్‌లో 5, కర్ణాటక, గుజరాత్, బిహార్‌లో 3 చొప్పున, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, కేరళలో 2 చొప్పున అరెస్టులు జరిగాయి.

**80కి పైగా ఎఫ్ఐఆర్‌లు**

చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం, భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద భట్టి నెట్‌వర్క్‌పై 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. సరిహద్దుల అవతలి నుంచి సాగుతున్న ఉగ్ర కార్యకలాపాలకు స్థానికంగా సహకరిస్తున్న నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించడమే లక్ష్యంగా దర్యాప్తు కొనసాగుతున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. గ్యాంగ్‌స్టర్ నుంచి ఉగ్రవాదిగా మారిన షహజాద్ భట్టికి సంబంధించిన మూడు ఉగ్రవాద, గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్ కేసుల్లో జాతీయ దర్యాప్తు సంస్థ పంజాబ్, హరియాణాల్లో 18 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. నిఘాలో ఉన్న వ్యక్తుల కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, ఆర్థిక లావాదేవీలు, కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించింది. డిజిటల్ పరికరాలు, పత్రాలను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్, సాంకేతిక పరీక్షలకు పంపింది. సరిహద్దుల అవతలి నుంచి సాగుతున్న కుట్ర వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌ను వెలుగులోకి తెచ్చేందుకు దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266